త్వరితగతిన కేసుల పరిష్కారం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: న్యాయస్థాన కేసులు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేశ్‌రెడ్డి సూచించారు. స్థానిక న్యాయస్థానం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయమూర్తులతో ఆదివారం వివిధాంశాలపై సమీక్షించారు. తొలుత ఏలూరు రెవెన్యూ అతిథి గృహానికి చేరుకున్న సురేశ్‌రెడ్డికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ స్వాగతం పలికి వేర్వేరుగా పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. ఆపై పోలీసు గౌరవ వందనం స్వీకరించిన హైకోర్టు న్యాయమూర్తి.. జిల్లా న్యాయస్థానానికి చేరుకుని సమీక్ష నిర్వహించారు. కేసుల విచారణ, న్యాయస్థానాల పనితీరుపై మాట్లాడారు. అనంతరం జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలోని వివిధ కోర్టులు, న్యాయసేవాధికార సంస్థ, బార్ అసోసియేషన్ కార్యాలయాలను పరిశీలించారు. చివరిగా న్యాయమూర్తులతో బృంద చిత్రం దిగారు. పలువురు న్యాయమూర్తులు, అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, రెవెన్యూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనే సీతారాం, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యుడు బీవీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



న్యాయమూర్తులతో సమీక్షిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేశ్‌రెడ్డి చిత్రంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తంకుమార్

రేపట్నుంచి ధాన్యం కొనుగోలు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో మంగళవారం ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు సంయుక్త కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. '2024-25 ఖరీఫ్‌లో సుమారు 1.80 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 5.60 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా. 3.40 లక్షల టన్నులు రైతుల నుంచి కొనుగోలు చేస్తాం. ధాన్యం సేకరణకు 250 కేంద్రాలు ఏర్పాటు చేశాం. 12 లక్షల గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయి. ధాన్యాన్ని మిల్లులకు తరలించే వాహనాలకు జీపీఎస్ విధానం అమల్లోకి తెచ్చాం. హమాలీల ఖర్చు, గోనె సంచుల వినియోగ రుసుము ప్రభుత్వమే చెల్లిస్తుంది. ధాన్యం సేకరణలో సమస్యలు ఎదురైతే 08812-230448, 77020 03584 లేదా టోల్‌ఫ్రీ నంబరు 1800 425 6453కు ఫిర్యాదు చేయొచ్చని' ఆమె వివరించారు.

ఈనాడు ఏలూరు
సోమవారం అక్టోబరు 21, 2024



ఏలూరు సర్వజన ఆసుపత్రి ముఖ ద్వారం

గత ఏడాది ఏలూరు సర్వజన ఆసుపత్రి మాతా శిశు విభాగంలో రాత్రి సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని మహిళా సెక్యూరిటీ గార్డులు గుర్తించారు. పసిపిల్లలను ఎత్తుకెళ్లేందుకు వచ్చాడని అనుమానించి పోలీసులకు అప్పగించారు.

రెండు నెలల కిందట ఆసుపత్రి ప్రాంగణంలో నిలిపి ఉంచిన ఓ ద్విచక్ర వాహనం అపహరణకు గురైంది. దీనిపై బాధితుడు టూటౌన్ పోలీసులను ఆశ్రయించాడు.

ఏడాదిన్నర కిందట ఆసుపత్రి విధుల్లో ఉన్న ఓ నర్సు బంగారు గొలుసు మాయమైంది. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

ఓ మాజీ సైనిక ఉద్యోగి తల్లికి అనారోగ్యంగా ఉండటంతో ఆమెను ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చేర్చారు. తల్లిని చూసేందుకు వచ్చిన అతడి చరవాణి దొంగిలించారు.

నిఘా నిద్రకు.. రక్షణ గాలికి..

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో భద్రతపై నీలినీడలు

మందుబాబులు, దొంగలకు అడ్డాగా ఆవరణ

పనిచేయని సీసీ కెమెరాలు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఇటీవల శవాల మాయం, ఇతర వరుస ఘటనలు అక్కడి భద్రతా వైఫల్యాలకు అద్దంపడుతున్నాయి. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి నిత్యం వేలాది మంది రోగులు, వారి కోసం వచ్చే బంధువులతో ఆసుపత్రి రద్దీగా ఉంటుంది. ఇంతటి కీలక ప్రాంతంలో పూర్తిస్థాయిలో పనిచేయని సీసీ కెమెరాలు, అరకొర రక్షణ సిబ్బందితో దొంగలు, అక్రమార్కులు ఎవరి స్థాయిలో వారు రెచ్చిపోతున్నారు. ప్రాంగణంలో ద్విచక్ర వాహనాలు, చరవాణులు ఎక్కువగా చోరీకి గురవుతున్నాయి. ఇటీవల పోలీసు అధికారులు ఆసుపత్రిలోని భద్రత పరిస్థితులను పరిశీలించి, అక్కడి అధికారులతో మాట్లాడారు. పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందిని సమావేశపరిచి వివిధ అంశాలపై వారికి అవగాహన కల్పించారు.

చీకటిపడితే జాతరే.. సర్వజన ఆసుపత్రి ప్రాంగణం రాత్రైందంటే తిరునాళ్లగా మారిపోతుంది. ఎక్కడెక్కడి నుంచో ఇక్కడకు వచ్చేస్తుంటారు. అర్ధరాత్రి దాటిందంటే అత్యవసర విభాగం ముందే హడావుడి కనిపిస్తోంది. పలువురు యువకులు మద్యం తాగి ఆసుపత్రి ప్రాంగణంలో ద్విచక్ర వాహనాలపై చెక్కర్లు కొడుతూ.. గొడవలు పడుతుంటారు. అత్యవసర విభాగంలోకి వచ్చే వైపు ప్రధాన ద్వారం బయట అర్ధరాత్రి దాకా కొంతమంది బండ్లు పెట్టుకుని అల్పాహారం అమ్ముతుంటారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి అక్కడకు వస్తుంటారు. వాళ్లలో కొంత మంది మందుబాబులు ఆసుపత్రిలోకి వచ్చి తిరుగుతుంటారు. లోపల నిర్జన ప్రదేశాల్లో రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. కొద్ది రోజుల కిందటి వరకూ కొందరు సిగరెట్లు, గంజాయి కూడా విక్రయించేవారని ఆరోపణలు ఉన్నాయి.


ఏలూరు: సిబ్బందికి సూచనలిస్తున్న పోలీసు అధికారి (పాతచిత్రం)


కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటాం.. 'ఆసుపత్రిలో భద్రతా చర్యలపై దృష్టి పెడతాం. ప్రాంగణంలో సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సిబ్బంది పూర్తి స్థాయిలో పనిచేసేలా ఏర్పాట్లు చేస్తాం. రాత్రి సమయాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తాం. ఆకతాయిలు రాకుండా కట్టడి చేస్తాం.' అని ఏలూరు సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకులు సుధాకర్ తెలిపారు.

300 పడకలు | **1,200** రోజువారీ రోగులు | **60** వైద్యులు | **380** సిబ్బంది | **55** సెక్యూరిటీ | **45** సీసీ కెమెరాలు | **20** అందులో పాడైనవి

శయన మహావిష్ణువుగా శ్రీవారు

ముగిసిన కల్యాణోత్సవాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శేషాచలంపై కొలువైన వేంకటేశ్వరుడి ఆశ్వయుజ మాస తిరుకల్యాణోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు రాత్రి పుష్పయాగోత్సవం నేత్ర పర్వంగా నిర్వహించారు. 12 రకాల వాయిద్యాలు, 12 గీతాలు ఆలపించి పవళింపు సేవ చేశారు. 12 రకాల పిండి వంటలు, పండ్లు నివేదించారు. అనంతరం మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్ ముక్కలు పంపిణీ చేశారు. ఆలయ పండితులు ధాన్యం, పసుపు కొమ్ములను దంచగా వచ్చిన చూర్ణంతో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేసి.. చక్రస్నానం చేయించారు. ఆ పవిత్ర జలాన్ని భక్తులకు వసంతంగా చల్లారు. క్షేత్ర వీధుల్లో రాజాధి రాజ వాహనంపై ఉభయ దేవేరులతో కలిసి స్వామి వారు విహరించారు. చివరి రోజు శ్రీవారు శయన మహావిష్ణువు అలంకారంలో దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


అలంకారంలో స్వామివారు


చూర్ణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

అందమైన బొమ్మలు.. ఆకట్టుకొనే బల్లలు..!

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

పోషణ వాటిక, మౌలిక వసతుల కల్పనకు 'సక్షం' నిధులు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: అందమైన బొమ్మలు, ఆట వస్తువులు, అర్ధ చంద్రాకృతిలో బల్లలు వాటికి కుర్చీలు, ఎల్ఈడీ స్మార్ట్ టీవీలు, రక్షిత మంచినీరు తదితర హంగులతో అంగన్‌వాడీ కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. వాటి పరిధిలోని లబ్ధిదారుల్లో రక్తహీనత, పోషకాహార లోపం తదితర సమస్యలను అధిగమించడంతోపాటు కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు జిల్లాలో సొంత భవనాలు ఉన్న 855 కేంద్రాలను ఎంపిక చేశారు. వాటిలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ 'సక్షం'(స్టిమ్యులేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టెయినబుల్ హెల్త్ మేనేజ్), పోషణ వాటిక కార్యక్రమాల అమలుకు సన్నద్ధమైంది.



ప్రాజెక్టు	కేంద్రాలు	ఎంపికైనవి
కొయ్యలగూడెం	168	43
బుట్టాయగూడెం	188	69
కుక్కునూరు	160	14

ఇక బడితోటలు కూడా.. వసతుల కల్పన కోసం ఒక్కో కేంద్రానికి ప్రత్యేక నిధులు మంజూరవుతాయి. ఇప్పటికే అందజేస్తున్న సంపూర్ణ పౌష్టికాహారానికి సమాంతరంగా కిశోరబాలికలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం పోషణ వాటిక పేరున బడితోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తారు. కేంద్రాల ఆవరణల్లో వాన నీటి సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. కూరగాయలు, ఆకుకూరల సాగు, పండ్ల మొక్కలు పెంచుతారు. వాటిని లబ్ధిదారులకే అందజేస్తారు. జిల్లాలో 2225 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను 855 సక్షం పథకానికి ఎంపికైనట్లు ఐసీడీఎస్ పీడీ కేవీఎల్ పద్మావతి తెలిపారు.

కేటాయింపులు ఇలా.. పోషణ వాటిక కార్యక్రమ అమలుకు ఒక్కో కేంద్రానికి రూ.10వేలు జమ చేయనున్నట్లు ఐసీడీఎస్ కొయ్యలగూడెం ప్రాజెక్టు సీడీపీవో తులసి తెలిపారు. సక్షం కార్యక్రమంలో మౌలిక వసతుల కల్పనకు రూ.19800, వాన నీటి సంరక్షణ ఏర్పాట్లకు రూ.16వేలు కేటాయించనున్నట్లు చెప్పారు.

అది చిరుతేనా..?

భయాందోళనకు గురవుతున్న ప్రజలు



భీమడోలు, ద్వారకాతిరుమల- న్యూస్‌టుడే: భీమడోలు శివారు, ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి పరిసరాల్లో చిరుత సంచరిస్తోందన్న ప్రచారం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. అందనాలమ్మ చెరువు ప్రాంతంలో గుర్తించిన జంతువు అడుగులు చిరుతవేనని అటవీ, పోలీసు అధికారులు ప్రాథమికంగా అంచనాకొచ్చారు. స్థానిక రైతులు మాత్రం సంచరిస్తోంది చిరుత కాదని.. అడవి పిల్లి అని చెబుతున్నారు. స్థానికంగా కొన్నాళ్లుగా అడవి పిల్లి తిరుగుతోందన్న వారు.. అడుగు జాడలు సైతం దానివేనని చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. అటవీ శాఖాధికారులు ఆదివారం ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో జంతువు అడుగుల నమూనాలు సేకరించి రాజమహేంద్రవరంలోని పరిశోధన కేంద్రానికి పంపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీపై తెదేపా గురి

అభ్యర్థిగా రాజశేఖర్ పేరు ప్రకటన

మొదలైన ఎన్నికల సందడి

కాకినాడ కలెక్టరేట్, ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కూటమి అభ్యర్థిని ప్రకటించారు. 2025 మార్చిలో ఈ నియోజకవర్గానికి ఎన్నికలు జరగనున్నాయి. ఈసారి ప్రధాన రాజకీయ పార్టీలు బరిలో నిలిచే అవకాశం ఉండటంతో ఓటు నమోదు ఊపందుకుంది. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం అభ్యర్థిగా బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం వేమవరానికి చెందిన పేరాబత్తుల రాజశేఖర్ పేరును తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు ఖరారు చేయడంతో కూటమి శ్రేణుల్లో సందడి మొదలయ్యింది. ఈ ఎన్నికల్లో అభ్యర్థిని నిలిపి, విజయం సాధించేందుకు కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలతో కొద్ది రోజులుగా సమన్వయ సమావేశాలు నిర్వహించారు. అర్హత ఉన్న పట్టభద్రులతో ఓటు నమోదు చేయిస్తున్నారు.


తెదేపా అధినేత చంద్రబాబుతో రాజశేఖర్ (పాతచిత్రం)

నాడు 46 మంది బరిలో.. గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ప్రస్తుతం పీడీఎఫ్ అభ్యర్థి ఇళ్ల వెంకటేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈయనకు 2025, మార్చి వరకు పదవీ కాలం ఉంది. 2019, మార్చిలో జరిగిన ఎన్నికల్లో 46 మంది పోటీలో నిలిచారు. మొదటి ప్రాధాన్యతా ఓటుతోనే ఇళ్ల విజయం సాధించారు. పీడీఎఫ్ నుంచి ఈసారి ఇంకా అభ్యర్థి పేరు ప్రకటించలేదు. కొందరు స్వతంత్రంగా పోటీ చేస్తామని చెబుతున్నారు. దీంతో ఎక్కువ మంది బరిలో ఉండే పరిస్థితి ఉంది.

సంఖ్య ఎక్కువే.. గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. 2019లో జరిగిన ఎన్నికల్లో 2,93,794 మందికి ఓటు హక్కు ఉంది. ఉమ్మడి తూర్పు గోదావరిలో 1,72,415, ఉమ్మడి పశ్చిమ గోదావరిలో 1,21,379 మంది ఓటర్లు అప్పట్లో ఉన్నారు. 293 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరిగాయి.

ఇదీ ప్రస్తుత షెడ్యూల్.. ఈ నియోజకవర్గానికి తాజాగా ఎన్నికలు జరిపేందుకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి చర్యలు చేపట్టారు. గత నెల 30న ఓటు నమోదు రిజిస్ట్రేషన్ ప్రకటన ఇచ్చారు.

ఓటు నమోదుకు దరఖాస్తుల స్వీకరణ గడువు: **నవంబరు 6**

ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ: **నవంబరు 23**

ఫారం-18 ద్వారా దరఖాస్తుల స్వీకరణ: **డిసెంబరు 9**

తుది ఓటర్ల జాబితా: **డిసెంబరు 30**

ముగిసిన పల్లె పండగ

ఇక ప్రగతి పనులు చేపట్టడమే

చివరి రోజున ఊరూరా సందడి

ఏలూరు వన్‌టౌన్, భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఊరూరా.. వేడుకగా జరిగిన పల్లె పండగ వారోత్సవాలు ముగిశాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారం రోజులపాటు కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో పెద్దఎత్తున సిమెంటు రహదారులు, కాలువలు, నల్లకంకర రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు, ఉద్యాన, వ్యవసాయ కుంటలు, గోకులాలు, ప్రహరీలు తదితర పనులకు భారీగా ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఆదివారం ఆఖరి రోజు కావడంతో జిల్లాలో ఆయా మండలాల్లోని గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పనులకు శంకుస్థాపనలు, భూమి పూజలు జోరుగా పండగ వాతావరణంలో నిర్వహించారు. యలమంచిలి మండలంలో నిర్వహించిన పల్లె పండుగలో మంత్రి నిమ్మల రామానాయుడు, జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పాల్గొన్నారు. భీమడోలు మండలంలో వివిధ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పాల్గొని శంకుస్థాపన చేశారు. జంగారెడ్డిగూడెం మండలంలో చక్రదేవరపల్లిలో సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ శంకుస్థాపన చేశారు.

సంక్రాంతికి పూర్తి చేసేలా.. ఉమ్మడి జిల్లాలో పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా పల్లెల్లో ప్రజలకు అవసరమైన 2,523 పనులకు భూమి పూజలు, శంకుస్థాపనలు చేశారు. ఈ పనులకు రూ.173.87 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. సంక్రాంతి పండగ నాటికి గ్రామాల్లో పల్లె పండుగ పేరుతో చేపట్టే అన్ని పనులను శరవేగంగా చేసేలా అధికారులు కార్యాచరణకు దిగారు.

జిల్లా	ఏలూరు	పశ్చిమ
చేపట్టిన పనులు	1,917	552
మంజూరైన నిధులు	121.57	52.03

(రూ.కోట్లలో)


భీమడోలు మండలంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించిన ధర్మరాజు, వీరాంజనేయులు తదితరులు

వికాసానికి విఘాతం


ఇరగవరం ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

☛ ఏలూరుకు చెందిన అయిదేళ్ల బాలుడికి ఓ ప్రభుత్వ పాఠశాలలో కంటి పరీక్షలు చేయగా దూరపు చూపు లోపంతో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. తల్లిదండ్రులను పిలిచి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, టీవీ, చరవాణికి దూరంగా ఉంచాలని సూచించారు. మరో విద్యార్థికి శుక్లాలు వచ్చినట్లు గుర్తించి శస్త్రచికిత్సకు సిఫార్సు చేశారు.


☛ దెందులూరులో 14 ఏళ్ల బాలుడు కంటి చూపు సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు. ఆటలాడే సమయంలో దూరపు వస్తువులను గుర్తించకపోవడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు వైద్యుల వద్దకు తీసుకెళ్లగా కళ్లజోడును సూచించారు.

చిన్నారుల్లో పెరుగుతున్న కంటి సమస్యలు


ప్రతి పది మందిలో ఒకరికి కళ్ల జోడు

ఈనాడు డిజిటల్, భీమవరం, దెందులూరు, ఏలూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ప్రతి వంద మంది పిల్లల్లో కనీసం 12 మంది తీవ్ర దృష్టి లోపంతో బాధపడుతున్నారని, పది మందిలో ఒకరికి కళ్లజోడు ఉన్నట్లు వైద్య గణాంకాలు చెబుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణాల్లోనే ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. భీమవరం, నరసాపురం, పాలకొల్లు, చింతలపూడి ప్రాంతీయ ఆసుపత్రుల్లో సరాసరిన ఓపీ 350 ఉంటే, ఇందులో 60 మంది కేవలం కంటి సమస్యలతో వస్తున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. పాఠశాల, కళాశాలల్లో ఏ తరగతి గదిలో చూసినా సగం మంది విద్యార్థులు కళ్లద్దాలతోనే ఉంటున్నారు. ఇవి లేకుండా చదవడం, రాయడం, బోర్డు చూడటం వంటి పనులు చేయలేకపోతున్నారు.

వ్యక్తిగత నిర్లక్ష్యంతోనే.. చాలా మంది చిన్నారులకు కంటి చూపు సమస్య తలెత్తినా చెప్పుకొనే అవకాశం, ఆలోచన రాదు. వీటిని గుర్తించే బాధ్యత తల్లిదండ్రులతో పాటు గురువులు తీసుకోవాలి. చిన్న వయస్సులో దగ్గర, దూరం చూపు సక్రమంగా ఉంటేనే దృష్టి లోపాలు తలెత్తవు. తమ కళ్లను ఎక్కువ సమయాన్ని దగ్గర చూపునకు పరిమితం చేయడం వల్లే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా నాలుగు గోడలకే పరిమితమై స్మార్ట్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోవడంతో సమస్యలు కొనితెచ్చుకోవడం అవుతోందని నిపుణులు చెబుతున్నారు.



గత మూడేళ్లలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇలా..



సర్కారు ప్రత్యేక శ్రద్ధ

పిల్లల్లో కంటి సమస్యలు అధికంగా వస్తున్నాయని గ్రహించిన కూటమి ప్రభుత్వం వారికి చికిత్స అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఆర్‌బీఎస్‌కే, నేత్ర వైద్యుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాల విద్యార్థులకు ఏడాది పొడవునా కంటి పరీక్షలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

మూడో ఏటే పరీక్షించాలి

పెరుగుతున్న సాంకేతికత, కాలుష్యంతో చిన్న, పెద్ద తేడా లేకుండా కంటిచూపు సమస్యలు ఎక్కువయ్యాయి. ఆసుపత్రికి వచ్చేవారిలో చిన్నారులే అధికంగా ఉంటున్నారు. పుట్టిన మూడో సంవత్సరంలోనే కంటి పరీక్ష తప్పనిసరిగా చేయించాలి. ప్రతిఒక్కరూ ఏడాదికొకసారి కంటి పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం.

– కె.రాజబాబు, కంటి వైద్య నిపుణులు



40 రోజుల్లోనే.. నీటి సంఘాల ఎన్నికలు

☛ నేడు ప్రకటన ☛ సవరించిన ఉత్తర్వులు జారీ

ఉండి, కాళ్ల, న్యూస్‌టుడే: సాగునీటి వినియోగదారుల సంఘాల (డబ్ల్యూయూఏ) ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. సోమవారం జిల్లా ఎన్నికల అథారిటీ ప్రకటన విడుదల చేయనుందని సవరించిన ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఓటర్ల జాబితా తయారీ నుంచి పోలింగ్ ప్రక్రియను 40 రోజుల్లో ముగించేలా రెవెన్యూ, జలవనరుల శాఖల అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ ప్రక్రియ గతంలో 90 రోజులు ఉండేది.


తూడు, చెత్తతో నిండిన వెలివర్రు పంట కాలువ

పునరుజ్జీవం దిశగా..! రైతు ప్రతినిధులు సభ్యులుగా ఉండే సాగునీటి వినియోగదారుల సంఘాలు 2003లో ఆవిర్భవించాయి. 2015లో ఈ ఎన్నికలు జరగగా కాలపరిమితి 2020తో ముగిసింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ఈ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. దీంతో పంట బోదెలు, మైనర్, మీడియం డ్రెయిన్ల నిర్వహణ అటకెక్కింది. వర్షం కురిస్తే చాలు పల్లపు ప్రాంతాల్లో చేలు ముంపుబారిన పడి ఏటా అన్నదాతలు నష్టాలు చవిచూస్తున్నారు. ఈ క్రమంలో సాగునీటి సంఘాలను పునరుద్ధరిస్తామని ఎన్డీయే ఎన్నికల్లో హామీ ఇచ్చింది. దీనిని అమలు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. ఈ నెల 21న కలెక్టర్లు ఎన్నికల ప్రకటన జారీ చేస్తారు. ఎన్నికల అధికారుల నియామకాన్ని తొలి రోజే పూర్తిచేస్తారు. అనంతరం గ్రామాల వారీగా సర్వే నంబర్ల ఆధారంగా ఓటర్ల జాబితా తయారు చేస్తారు. నవంబరు 21-23 తేదీల మధ్య సంఘాల సభ్యులు, అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడి ఎన్నికలు పూర్తి చేయాలి. అదే నెల 24-26 తేదీల మధ్య నీటి పంపిణీ సంఘాలు (డీసీ)లు, 27-29 తేదీల మధ్య ప్రాజెక్టు కమిటీ (పీసీ) కార్యవర్గ ఎన్నికలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

పశ్చిమ డెల్టా ఆయకట్టు: **5,29,962** ఎకరాలు

మండలాలు: **29**

నీటి వినియోగదారుల సంఘాలు (డబ్ల్యూయూఏలు): **131**

జలవనరుల శాఖ సబ్ డివిజన్లు: **4** (ఉండి, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం)

డిస్ట్రిబ్యూటరీ కమిటీలు (డీసీలు): **20** (నిడదవోలు, తాడేపల్లిగూడెం, పెంటపాడు, గుండుగొలను, పోతునూరు, తణుకు, అర్ధవరం, అనాకోడేరు, ఉండి, ఆకివీడు, అడవికొలను, నరసాపురం, అత్తిలి, పెనుమంట్ర, వీరవాసరం, భీమవరం, పాలకొల్లు, మార్టేరు, పెరవలి, సిద్ధాంతం)

ఆరోగ్యానికి పొగ..!




వరి పొలాల్లో చీడపీడల నివారణకు కొంతమంది రైతులు హానికర పురుగు మందులను, రసాయనాలను పిచికారీ చేస్తున్నారు. వాటి అవశేషాలు వ్యవసాయోత్పత్తుల్లో మిగిలిపోవడంతో ప్రజారోగ్యంపై ప్రభావాన్ని చూపుతున్నాయి. దెందులూరు మండలం సత్యనారాయణపురం సమీపంలోని జాతీయ రహదారి పక్కన కనిపించిన చిత్రమిది. **- ఈనాడు, ఏలూరు.**

అక్కడలా.. ఇక్కడిలా..


భీమడోలు జాతీయ రహదారి నుంచి ద్వారకాతిరుమల వెళ్లే రహదారి మధ్యలోని విభాగినుల్లో పలుచోట్ల గతంలో మొక్కలను నాటారు. నీటి వసతి కోసం డ్రిప్ (బిందు సేద్యం) పద్ధతులను అమర్చారు. నిర్వహణ కొరవడటంతో కొన్ని మొక్కలు ఎండిపోయాయి. విభాగినుల దిమ్మెలు విరిగిపోయి, నాచు పట్టి కళావిహీనంగా మారాయి. విర్డ్ ఆసుపత్రి నుంచి ఆలయ కూడలి వరకూ పచ్చదనాన్ని పరిరక్షించడంతో పూలతో అందంగా కనువిందు చేస్తోంది. మిగిలిన ప్రాంతమంతా వెలవెలబోతోంది. అధికారులు పరిశీలించి విభాగినులను బాగుచేసి, పచ్చదనాన్ని పెంపొందించి, సుందరంగా తీర్చిదిద్దాలని భక్తులు కోరుతున్నారు.



విర్డ్ ఆసుపత్రి సమీపంలో పూలతో కళకళలాడుతున్న విభాగిని



గొల్లగూడెం సమీపంలో ఎండిపోయి ఇలా..



మొక్కల కోసం ఏర్పాటు చేసిన డ్రిప్

– ఈనాడు, ద్వారకాతిరుమల.

అక్రమాలకు ఉపాధి

నలుగురు సిబ్బంది సస్పెన్షన్

ఈనాడు డిజిటల్, భీమవరం, తాడేపల్లిగూడెం, భీమవరం అర్బన్, న్యూస్‌టుడే : జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనుల్లో కూలీల పేరుతో వేతనాలు కాజేసినా... తప్పుడు హాజరుతో అక్రమాలకు పాల్పడినా... తక్కువ విస్తీర్ణంలో చేసిన పనిని ఎక్కువగా చూపి నిధులు నొక్కేసినా గత వైకాపా సర్కారు పట్టించుకున్న పాపాన పోలేదు. వాటిని గుర్తించి చర్యలకు సిఫార్సు చేయాల్సిన సామాజిక తనిఖీలు సైతం తూతూమంత్రంగా జరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక చేపట్టిన తనిఖీల్లో అవి బయటపడుతున్నాయి.



● ఆచంటలో పనులు చేసేందుకు కొంతమంది కూలీలు వచ్చినా రాకపోయినా మస్తరు వేయడం, జాబ్‌కార్డులు సృష్టించి కూలి డబ్బులు చెల్లించినట్లు చూపించి అధికారులు చేతివాటానికి పాల్పడ్డారు. నివేదికలో బయట పడటంతో క్షేత్ర, సాంకేతిక సహాయకులిద్దరినీ (ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు) సస్పెండ్ చేశారు.

● పెనుగొండ మండలంలో పని చేసేందుకు కూలీలు రాకపోయినా మస్తర్లు వేయడం బయట పడటంతో ఇద్దరు క్షేత్ర సహాయకులను సస్పెండ్ చేశారు.

సామాజిక తనిఖీతో..

గత ప్రభుత్వంలోని కొందరు నాయకులు, క్షేత్ర స్థాయి సహాయకుల నిర్వాకంతో ఉపాధి పథకం లక్ష్యం నీరుగారిపోయింది. పని చేయని వారికి తప్పుడు మస్తర్లతో నగదు జమయ్యేలా చేశారు. ఈ ఏడాది చేపట్టిన సామాజిక తనిఖీ నాలుగు మండలాల్లో పూర్తవగా నలుగురు అధికారులను సస్పెండ్ చేశారంటే పరిస్థితి ఏవిధంగా అర్థం చేసుకోవచ్చు. ఇంకా 16 మండలాల్లో సర్వే చేపట్టాల్సి ఉండటంతో మిగిలిన వారికి గుబులు పట్టుకుంది. ఆరోపణలు రుజువై, విధుల నుంచి వైదొలిగిన సిబ్బంది నుంచి నగదు రికవరీ చేసేందుకు రెవెన్యూ సిబ్బందికి సిఫార్సు చేశారు. ఈ ఏడాది పనులు మరో నాలుగైదు నెలల్లో ముగుస్తున్న నేపథ్యంలో సామాజిక తనిఖీలు పూర్తి పారదర్శకంగా జరిగితే మరిన్ని అక్రమాలు బయటకొచ్చే అవకాశం ఉంది. 'ఆరోపణ లున్న సిబ్బందికి నోటీసులిచ్చాం." అని డ్వామా పీడీ అప్పారావు పేర్కొన్నారు.

మండలాలు	జాబ్‌కార్డులు	యాక్టివ్‌గా ఉన్నవి	రోజువారీ కూలీ	దుర్వినియోగమైన నిధులు	సిబ్బంది నుంచి రికవరీ చేసింది
20	1,65,058	94,967	రూ. 300	రూ. 2.24 కోట్లు	రూ. 1.99 కోట్లు

'సర్వోదయ'కు స్వీయ రచనల ఆహ్వానం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: బాలల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు 'బాల భాషిణి సర్వోదయ' బాలల పత్రికకు స్వీయ రచనలను ఆహ్వానిస్తున్నట్లు సర్వోదయ మండలి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. నవ భారత నిర్మాణం, విద్యార్థుల పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, పొదుపు-నిరాడంబరత, నీతి కథలు అంశాల్లో నవంబరు 5లోపు సర్వోదయ మండలి, గాంధీ కస్తూర్బా భవనం, శ్రీరాంపురం, భీమవరం-2, పశ్చిమగోదావరి జిల్లా చిరునామాకు తపాలా ద్వారా రచనలు పంపాలన్నారు. ఉత్తమ రచనలకు నవంబరు 14న బాలల దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ముగిసిన ఓపెన్ సైట్ క్యాటగిరీ

రాజానగరం, న్యూస్‌టుడే: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం సంపతనగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఓపెన్‌సైట్ క్యాటగిరీలు ఆదివారం ముగిశాయి. ఎస్‌జీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి విజేతల వివరాలను వెల్లడించారు. ఈ క్యాటగిరీలో ఓవరాల్ ఛాంపియన్స్‌గా అనంతరపురం, కర్నూలు, వైఎస్ఆర్ కడప జిల్లాలు నిలిచాయని ఆయన అన్నారు.

● **అండర్-14 బాలికల విభాగంలో..** మొదటి స్థానం కర్నూలు, ద్వితీయ స్థానం పశ్చిమ గోదావరి జిల్లాలు నిలిచాయి.

బాలుర విభాగంలో: మొదటి స్థానం పశ్చిమ గోదావరి, ద్వితీయంలో కర్నూలు.

● అండర్-17 బాలికల విభాగంలో.. పశ్చిమ, కర్నూలు మొదటి, ద్వితీయ స్థానాలు సాధించాయి.

బాలుర విభాగంలో.. మొదట కర్నూలు, ద్వితీయ స్థానంలో తూర్పుగోదావరి జిల్లా

● **అండర్-19 బాలికల విభాగంలో..** వైఎస్ఆర్ కడప, కృష్ణా జిల్లాలు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి.

బాలుర విభాగంలో.. అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాలు వరుసగా ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించాయి. వీరికి డీవైఈవో నారాయణ బహుమతులు అందజేశారు. ప్రతిభావంతులను గుర్తించి జాతీయ స్థాయి పోటీలో పాల్గొనే జట్టును ఎంపిక చేశామన్నారు. పాఠశాల ఛైర్మన్ టి.కె.విశ్వేశ్వరరెడ్డి, డైరెక్టర్ స్వరూపరెడ్డి, పీడీలు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి పోటీలో పాల్గొనే జట్టు

సామాజిక సేవ.. బాగుపడుతున్న తోవ

ముదినేపల్లి, న్యూస్‌టుడే: గత అయిదేళ్ల వైకాపా పాలనలో రహదారుల అభివృద్ధిని విస్మరించడంతో అవి రూపురేఖలు పూర్తిగా కోల్పోయాయి. ప్రభుత్వం రహదారులకు కనీస మరమ్మతులు చేయక పోగా కనీసం కార్పొరేట్ సంస్థలు, దాతలను సైతం ముందుకు వచ్చేలా ప్రోత్సహించలేదు. కూటమి ప్రభుత్వం పల్లె పండగ పేరుతో గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రహదారుల నిర్మాణం చేపట్టారు. స్థానిక పరిశ్రమలు భాగస్వాములై బాగు చేసేలా ప్రోత్సహిస్తున్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పిలుపు మేరకు సింగరాయపాలెంలోని గ్రోవెల్ పరిశ్రమ నియోజకవర్గంలోని పలు రహదారులకు మరమ్మతులు నిర్వహిస్తోంది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ఇప్పటికే సుమారు రూ.40 లక్షలతో సింగరాయపాలెం, వడాలి, ముదినేపల్లిలో రహదారులకు మరమ్మతులు చేశారు.



వడాలి సెంటరులో మరమ్మతులు

వలకు చిక్కిన భారీ పండుగప్ప

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: దొంగరావిపాలెం వద్ద గోదావరిలో ఆదివారం జాలరు కె. సత్యనారాయణ చేపలు పట్టేందుకు వల వేయగా సుమారు 8 కిలోల పండుగప్ప చేప చిక్కింది. ఈ చేపను సిద్ధాంతం మార్కెట్లో తీసుకురాగా రూ.5000 ధర పలికింది.



మహిళా కార్మికులకు రక్షణ కల్పించాలి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: మహిళా కార్మికులకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు వి. ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో భవన నిర్మాణ రాష్ట్ర మహిళా కార్మికుల సమావేశం ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు నారపల్లి రమణారావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వీ నరసింహారావు మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాల నుంచి రాష్ట్రానికి వలస కార్మికులు వస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వలస కార్మిక చట్టాలు అమలు చేయాలన్నారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. పని ప్రదేశంలో మహిళలపై చేపడుతున్న దాడులు, అసాంఘిక కార్యకలాపాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

నూతన కమిటీ ఎన్నిక

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ వాహన చోదకుల సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక సంఘ భవనంలో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం సంఘాధ్యక్షుడిగా తోట శ్రీనివాసరావు ఎన్నుకున్నారు. ఆయన ఏడాది పాటు అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. ఆ తర్వాత రెండేళ్ల పాటు జి. ఈశ్వరరావు అధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. ఎన్నికల పరిశీలకులుగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు డీఎస్ కొండయ్య వ్యవహరించారు. ఎన్నికల అధికారిగా కె.చిరంజీవి, సహాయ ఎన్నికల అధికారిగా వి.పాపారావు పర్యవేక్షించారు. రాష్ట్ర సలహాదారు వై.నాగరాజు, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు డి.వేణుగోపాలరావు, వైజీఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



నాయకులను అభినందిస్తున్న సంఘ ప్రతినిధులు

కీలక కొలువులన్నీ ఖాళీ

ఐటీడీఏలో ఇన్‌ఛార్జుల పాలన

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ఆదివాసీ గిరిజనుల సమగ్ర సంక్షేమాభివృద్ధికి ఏర్పాటు చేసిన కేఆర్‌పురం ఐటీడీఏలో కీలక అధికారుల ఖాళీలు భర్తీకి నోచుకోవడం లేదు. ఇన్‌ఛార్జిలతో నెట్టుకొస్తున్నారు. దీంతో ఆయా విభాగాల నిర్వహణ, కార్యక్రమాల అమలు తీరుపై పూర్తిస్థాయి పర్యవేక్షణ కొరవడింది.

తొమ్మిది మందికి ఒక్కరే.. గతంలో పీవోగా పనిచేసిన సూర్యతేజ ఈ ఏడాది జులై 23న నెల్లూరుకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం జేసీ ధాత్రిరెడ్డి పీవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడి పోస్టు 2022 జులై నుంచి ఖాళీగా ఉంది. అప్పటి నుంచి ఐటీడీఏ ఏపీవో నాయుడు ఇన్‌ఛార్జిగా ఉన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీకేథరిన్ మెడికల్ లీవ్‌లో ఉండటంతో పులిరాముడుగూడెం పీహెచ్‌సీ వైద్యుడు సురేశ్‌కుమార్ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. పోలవరం ప్రత్యేక ఉప కలెక్టర్ నాలుగు నెలల కిందట ఉద్యోగ విరమణ పొందారు. కేఆర్‌పురం ప్రత్యేక ఉప కలెక్టర్ శ్రీనుకుమార్ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. ప్రత్యేక చిన్నతరహా జలవనరుల విభాగానికి 2020 నుంచి జంగారెడ్డిగూడెం ఎర్ర కాలువ డీఈ రాంబాబు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ విభాగం పరిధిలో 9 మంది జేఈలకు గానూ ఒక్కరు మాత్రమే ఉన్నారు. ప్రాజెక్టు వ్యవసాయాధికారి పోస్టు అయిదేళ్లుగా ఖాళీగా ఉంది. ఉద్యానాధికారి ఇన్‌ఛార్జిగా ఉన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కుమార్ ఇటీవల బదిలీ కావడంతో డీఈ డేవిడ్‌రాజుకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.



రేపల్లి రహదారి దుస్థితి

ఐటీడీఏ పరిధిలో..
మండలాలు: బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు
గ్రామాలు: 152
రెవెన్యూ: 409
శివారు గిరిజనులు: 97,029

అటవీ శాఖ అనుమతి కోసం నిరీక్షణ..

బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామం అలివేరు నుంచి లంకపాకల మీదుగా రేపల్లి వరకు 2022-23లో 5.7 కిలోమీటర్ల మేర రహదారి పునర్నిర్మాణానికి రూ.2.50 కోట్లు మంజూరు చేశారు. మూడు కిలోమీటర్ల వరకే తారురోడ్డు నిర్మించారు. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అటవీ శాఖ అనుమతుల కోసం నిరీక్షిస్తున్నారు.

మూడు నెలలకోసారి ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నిర్వహించాల్సి ఉంగా.. చివరిగా గతేడాది ఆగస్టులో నిర్వహించారు. ఇన్‌ఛార్జి అధికారులు ఉండటం, పాలకవర్గ సమావేశం నిర్వహించకపోవడంతో గిరిజన సంక్షేమ పథకాల అమలు, మన్యం గ్రామాల్లో అభివృద్ధి పనులపై పూర్తి స్థాయి సమీక్షలు కొరవడ్డాయి. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు ఏపీవో పీవీఎస్ నాయుడు తెలిపారు.

కనులపండువగా కళా సమ్మేళనం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. నాట్యాచార్య గండికోట రాజేశ్(జాహ్నవి లాలిత్య) బృందం నృత్య ప్రదర్శన, చిన్నారి ఎల్.శశ్వత్ ఆంజనేయ పాత్రలో గానం చేసిన పద్యాలు కళాభిమానుల హృదయాల్ని దోచాయి. సత్రంపాడు రామాంజనేయ నాట్యమండలి ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయబారం నాటిక ప్రేక్షకులను ఆనంద పరవశుల్ని చేసింది. పౌరాణిక రంగస్థల కళాకారుడు వి.రామాంజనేయ సిద్ధాంతిని సంఘం తరఫున సత్కరించారు. ఆర్థికంగా వెనుకబడిన రంగస్థల కళాకారులు పిల్లి శౌరి, బి.రామారావు, ఇ.లక్ష్మణరావు, బి.వాణిలకు గుప్తా ఫౌండేషన్ ట్రస్టు తరఫున ఆర్థిక ప్రోత్సాహకాలు అందజేశారు. బి.వి.రామరాజు జ్ఞాపకార్థం కుమారుడు బి.వి.రోషన్ పట్టాభి వర్మ సన్మాన గ్రహీతలకు నూతన వస్త్రాలు బహూకరించారు. సంస్థ అధ్యక్షుడు వంకినేని భానుప్రకాశ్, సంఘం అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి గండికోట రాజేశ్, కోశాధికారి కె.వి.సుబ్బారావు, సాహితీవేత్త డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు, గుప్తా ఫౌండేషన్ మేనేజర్ శ్రీనివాస్, కళాభిమానులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

వెంటాడిన గొలుసు దొంగలు

వాహనం అదుపుతప్పి దంపతులకు తీవ్ర గాయాలు

పాలకోడేరు, న్యూస్‌టుడే: జిల్లాలో పలు ప్రాంతాల్లో గొలుసు దొంగలు చెలరేగిపోతున్నారు. వీరి దాడిలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులు తీవ్రంగా గాయపడిన ఘటన పాలకోడేరు మండలం గరగపర్రులో జరిగింది. ఎస్సై ఎం.రవివర్మ కథనం ప్రకారం.. గరగపర్రు వాసి చామన శ్రీను తన భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై శనివారం రాత్రి భీమవరం వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా గొల్లలకోడేరు దాటాక నాగముని ఆలయం సమీపాన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వారిని వెంబడించి శ్రీను భార్య మెడలో బంగారు గొలుసును లాగారు. ఆమె ప్రతిఘటించడంతో పెనుగులాట చోటు చేసుకుని శ్రీను దంపతులు కిందపడిపోయారు. శ్రీనుకు కాలు విరగగా అతడి భార్య తలకు తీవ్ర గాయమైంది. దొంగల కోసం గాలిస్తున్నామని ఎస్సై తెలిపారు.

వెల్లమిల్లి వాసికి రైతు నేస్తం పురస్కారం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: వెల్లమిల్లికి చెందిన రైతు పరిమి సత్యనారాయణకు రైతు నేస్తం పురస్కారం లభించింది. పూర్వపు ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. కృష్ణా జిల్లా ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్టులో ఆదివారం రైతునేస్తం 20వ వార్షికోత్సవం నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న సుమారు 20 మంది రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్త ఐ.వి.సుబ్బారావు పేరిట ముప్పవరపు ఫౌండేషన్‌తో 'రైతు నేస్తం' పురస్కారాలు ప్రదానం చేశారు.



సత్యనారాయణను సత్కరిస్తున్న పూర్వపు ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

భద్రత.. భరోసా

● అలుపెరగని సేవలందిస్తున్న పోలీసులు
● నేడు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:

ఒంటిపై ఖాకీ.. చేతిలో లాఠీ.. తలపై మూడుసింహాల టోపీతో రోడ్డుపై ఓ పోలీసు ఠీవిగా వెళ్తుంటే ప్రజలకు ఓ భరోసా.. పోలీసులు ఉన్నారన్న భద్రతాభావం కలుగుతుంది. సమాజంలో శాంతిభద్రల పరిరక్షణకు పోలీసులు రాత్రింబవళ్లు తేడా లేకుండా పని చేస్తున్నారు. విధి నిర్వహణలో మానసిక, శారీరక ఒత్తిళ్లు అధిగమిస్తూ... బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పోలీసు వ్యవస్థ సంక్షేమానికి ప్రభుత్వాలూ పెద్దపీట వేస్తున్నాయి. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కథనం.



ఆరోగ్యానికి పెద్దపీట

పోలీసులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రతకు ఏలూరులో ప్రత్యేకంగా ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఒక వైద్యుడు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందిస్తున్నారు. రోజూ పదుల సంఖ్యలో సిబ్బంది, వారి కుటుంబీకులు వైద్యం పొందుతున్నారు. దీనికితోడు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి.. నిపుణులతో వివిధ పరీక్షలు చేయిస్తున్నారు. పని ఒత్తిడిని అధిగమించి మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం కల్పించేలా పోలీసు జిమ్ ఏర్పాటు చేశారు. అన్ని రకాల వ్యాయామాలకు అత్యాధునిక పరికరాలున్నాయి. సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు ఇక్కడ సాధన చేయొచ్చు. సురేశ్ బహుగుణ ఆంగ్ల మాధ్యమ పోలీసు పాఠశాల నిర్వహిస్తున్నారు.



ఆర్థిక తోడ్పాటు..

పోలీసుల సంక్షేమానికి ఆర్థిక తోడ్పాటునందించాలన్న ఉద్దేశంతో శాంతినగర్ అడ్డరోడ్డులో ఏడేళ్ల కిందట పెట్రోలు బంక్ ప్రారంభించారు. ప్రస్తుతం రెండో బంక్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. పోలీసు కల్యాణ మండపం, వేడుక హాలు నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పోలీసుల సంక్షేమ నిధికి కేటాయిస్తున్నారు. 'పోలీసుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. సమాజ శ్రేయస్సుకు రక్షకభటులు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. వారి కుటుంబాలకు ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరిస్తాం. అనారోగ్యం, ఇతర కారణాలతో మృతి చెందిన పోలీసు కుటుంబాలను ఆదుకుంటున్నాం. వారికి శాఖా పరంగా రావాల్సిన సొమ్ము త్వరితం అందేలా చూస్తున్నాం. కారుణ్య నియామక ప్రక్రియ వేగంగా జరిగేలా దృష్టి పెట్టాం' అని ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ తెలిపారు.

తక్కువ ధరకే సరకులు

బహిరంగ విపణి కంటే తక్కువ ధరలకు పోలీసు కుటుంబాలకు నిత్యావసర సరకులు, ఇతర గృహోపకరణాలు అందుబాటులోకి తీసుకొస్తూ పదేళ్ల కిందట ఏలూరులో పోలీసు రాయితీ క్యాంటీను ఏర్పాటు చేశారు. అక్కడ పోలీసు కుటుంబాలకు చెందిన వారే పని చేస్తున్నారు. పోలీసు కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా రుణాలిస్తూ వారి కుటుంబాల్లో శుభకార్యాలు, పెళ్లిళ్లు, పిల్లల ఉన్నత చదువులకు తోడ్పాటునందిస్తున్నారు. పోలీసులకు ప్రత్యేకంగా గ్యాస్ ఏజెన్సీ పాయింట్ ఏర్పాటు చేసి.. సిలిండర్లు సరఫరా చేస్తున్నారు.



జిల్లా సమాచారమిలా..
పోలీసు స్టేషన్లు: 32
పోలీసులు: 2 వేల మంది
హోంగార్డులు: 950

నూజివీడులో అత్యధిక వర్షపాతం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో శనివారం ఉదయం 8.30 నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల మధ్య 6.0 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైందని ఇన్‌ఛార్జి సీపీవో బి.శ్రీదేవి తెలిపారు. నూజివీడులో అత్యధికంగా 20.6, కుక్కునూరులో అత్యల్పంగా 1.0 మి.మీ. వర్షం కురిసినట్లు చెప్పారు. కలిదిండి 20.4, ముసునూరు 17.8, మండవల్లి 13.6, పోలవరం 13.2, ముదినేపల్లి 12.6, కైకలూరు 10.2, ఆగిరిపల్లి 9.6, కామవరపుకోట 7.2, చాట్రాయి 7.2, భీమడోలు 6.4, నిడమర్రు 5.4, కొయ్యలగూడెం 5.2, వేలేరుపాడు 5.0, ఉంగుటూరు 3.8, ఏలూరు గ్రామీణం 3.6, లింగపాలెం 2.2, ఏలూరు నగరం 1.6 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 254 చికెన్ స్కిన్‌లెస్ - 264.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.15 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కైకరంలో చోటుచేసుకుంది. చేబ్రోలు పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కూన సూర్యనారాయణ(71) రెణ్నెల్లుగా మొలల వ్యాధితో బాధపడుతున్నారు. ఏలూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఫలితం లేకపోవడంతో ఈ నెల 19న పురుగు మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయన్ను కుటుంబ సభ్యులు ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మృతుడి కుమారుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు.



సూర్యనారాయణ (పాత చిత్రం)

ఈతకెళ్లి వ్యక్తి గల్లంతు

పెదవేగి, న్యూస్‌టుడే: పోలవరం కుడి కాలువలో ఈతకెళ్లిన ఓ వ్యక్తి గల్లంతైన ఘటన పెదవేగి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై కె.రామకృష్ణ, స్థానికుల కథనం మేరకు... కవ్వకుంటకు చెందిన బెజవాడ ప్రసాద్(45) ఆదివారం సాయంత్రం పోలవరం కుడి కాలువలో ఈతకెళ్లారు. కొందరు వీడియో తీస్తుండగా- ఆయన ఈత కొడుతూనే కాలువలో మునిగిపోయారు. గట్టు పైనున్న వారు ఆందోళనకు గురై పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రామకృష్ణ ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. ఏలూరు అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారమిచ్చారు. వారు వచ్చేటప్పటికి చీకటి పడటంతో గాలింపు చర్యలు చేపట్టలేక పోయారు. ప్రసాద్ తల్లిదండ్రులు దీర్ఘకాల అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. ఇంటి బాగోగులు చూస్తున్న కుమారుడి గల్లంతుతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఏలూరు

●ఏలూరు ●దెందులూరు ●ఉంగుటూరు

పల్లెల సమగ్రాభివృద్ధికి తోడ్పాటు: ఎమ్మెల్యే

భీమడోలు, న్యూస్‌టుడే: పల్లెల సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ఎన్డీయే ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పూళ్ల, ఎం.ఎం.పురం, వడ్లపట్ల, పోలసానిపల్లి, భీమడోలు గ్రామాల్లో ఆదివారం పల్లె పండగ వారోత్సవాలు నిర్వహించారు. సీసీ రోడ్ల నిర్మాణాలకు తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో కలిసి ధర్మరాజు శిలాఫలకాలు ఆవిష్కరించి మాట్లాడారు. పల్లె పండగతో గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడతాయన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలుగా మంచి చేస్తోందని పేర్కొన్నారు. నాయకులు పవన్, కొండబాబు, పుప్పాల హరీశ్, పుప్పాల శ్రీనివాసు, నోచర్ల శ్రీనివాసు, గణేశ్, పెద్దిరాజు, ప్రవీణ్‌పటేల్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రైతు సదస్సు విజయవంతానికి పిలుపు

కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: విజయవాడ వేదికగా ఈ నెల 22న జరగనున్న జాతీయ రైతు సదస్సును విజయవంతం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, జిల్లా మాజీ అధ్యక్షుడు గుత్తి కొండ వెంకట కృష్ణారావు కోరారు. కైకరం తూర్పు వీధిలో ఆదివారం కౌలు రైతుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సమగ్ర కౌలు చట్టం తీసుకొచ్చేందుకు ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని తీర్మానించనున్నట్లు చెప్పారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847 | ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483 | ఉంగుటూరు : 79933 00492

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే

సమస్య: అగ్రహారం అంబికా థియేటర్ ఎదురు రోడ్డులోని కాలువలో మురుగు పేరుకుపోయింది. రాత్రివేళ దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. **- ఎం.పరమేశ్వరరావు, స్థానికుడు**

సమస్య: ఏఎస్ఆర్ కాలనీ వినాయక గుడి రోడ్డులోని కాలువలో మురుగునీరు సరిగా పారడం లేదు. దుర్వాసన రావడంతో ఇబ్బంది పడుతున్నాం. **- వెంకటేశ్వరరావు, స్థానికుడు**

సమాధానం: ఆయా కాలనీల్లోని కాలువల్లో పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తాం.

- భానుప్రతాప్, నగరపాలక అధికారి

పెదపాడు, న్యూస్‌టుడే

సమస్య: జాతీయ రహదారి నుంచి పునుకొల్లు వెళ్లే దారిలో మురుగు పేరుకుపోతోంది. స్థానిక హోటల్ నిర్వాహకులు వ్యర్థాలు పడేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. **- వాహన చోదకులు**

సమాధానం: పునుకొల్లు దారిని పరిశీలిస్తాం. మురుగు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- సూర్యకుమార్, ఈవోపీఆర్డీ**

ఉంగుటూరు, న్యూస్‌టుడే

సమస్య: సీతారామపురంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ప్రధానంగా ద్విచక్ర వాహనాల వెంట పడుతుండటంతో వారు అదుపు తప్పిపడి ఆసుపత్రి పాలవుతున్నారు. **- సుబ్బారావు, స్థానికుడు**

సమాధానం: కుక్కలను పట్టించి దూరంగా వదిలి పెడతాం.

- చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ

గణపవరం, న్యూస్‌టుడే

సమస్య: జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించి రెండేళ్లవుతుంది. గృహం నిర్మించకుంటే స్థలం రద్దు చేస్తామని చెప్పడంతో అప్పులు చేసి నిర్మాణం పూర్తి చేశాం. ఇప్పటి వరకు రహదారి, తాగునీటి సౌకర్యం కల్పించలేదు. **- స్థానికులు**

సమాధానం: త్వరలోనే కాలనీని సందర్శిస్తా. అక్కడ మెరుగైన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటా. **- బేబి శ్రీలక్ష్మి, ఎంపీడీవో**

తొలగిన చెత్తాచెదారాలు

స్పందనకు వందనం

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: ఒకటో పట్టణం బెనర్జీపేట న్యూ మార్కెట్ సందులో చెత్తాచెదారాలు తొలగించారు. వ్యర్థాలు పేరుకుపోవడంతో 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ఈ నెల 15న వార్త ప్రచురితమైంది. నగరపాలక అధికారి భానుప్రతాప్ స్పందించి, పారిశుద్ధ్య సిబ్బందితో చెత్తాచెదారాలు తొలగింపజేశారు.

కాలువలు శుభ్రం.. కొత్తూరు రాజీవ్ గృహకల్ప కాలనీ ఆరో రోడ్డులోని కాలువల్లో పూడిక తొలగింది. కాలువల్లో మురుగు ముందుకెళ్లకపోవడంతో ఈ నెల 14న ప్రచురితమైన వార్తకు నగరపాలక అధికారి భానుప్రతాప్ స్పందించి, సమస్య పరిష్కరించారు.

వెలిగిన వీధి దీపం.. తూర్పువీధి సాయిబాబా గుడి రోడ్డులో ఎట్టకేలకు వీధి దీపం వెలిగింది. వారం రోజులుగా దీపం వెలగకపోవడంపై ఈ నెల 16న ప్రచురితమైన వార్తకు విద్యుత్తు ఏఈ కె.శేషగిరి స్పందించారు. సిబ్బందిని పంపి దీపానికి మరమ్మతులు చేయించారు.

పడిలేస్తూ.. పయనిస్తూ!

అధ్వానంగా మారిన గ్రామీణ రహదారులు

భీమడోలు ఎస్సీ కాలనీలోని సీసీ రోడ్లు మురుగుతో నిండిపోయాయి. కాలనీలో మురుగు కాలువలు లేకపోవడంతో.. వాడుక నీరంతా రహదారిపైకి చేరుతున్నాయి. ఫలితంగా స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో మురుగులోనే రాకపోకలు సాగిస్తున్నారు.



మండల కేంద్రం భీమడోలులోని ప్రధాన రహదారులన్నీ దారుణంగా దెబ్బతిన్నాయి. భీమడోలు-ద్వారకాతిరుమల రహదారి అడుగడుగునా భారీ గోతులతో దర్శనమిస్తోంది. ఈ మార్గంలో వాహనాలు పడుతూ, లేస్తూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ దారి మరింత ఛిద్రంగా తయారైంది.



పెదపాడు మండలంలోని ఏలూరు- కృష్ణా కాలువపై తోటగూడెం వద్దనున్న వంతెన శిథిలావస్థకు చేరింది. ఇరువైపులా రెయిలింగ్, రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. ఈ వంతెన మీదుగా ఏలూరు, కృష్ణా జిల్లాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు వాహనాల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్గం సైతం అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



న్యూస్‌టుడే, భీమడోలు, పెదపాడు

భీమడోలు, పెదపాడు మండలాల్లోని గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. అయిదేళ్ల వైకాపా పాలనలో రోడ్ల అభివృద్ధి చేయకపోగా- ఛిద్రమైన దారులకు కనీసం మరమ్మతులు చేసిన దాఖలాల్లేవు. దీనికితోడు ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు రహదారులు మరింత దారుణంగా మారాయి. అడుగుకో గుంత, గజానికో తటాకం చొప్పున తయారయ్యాయి. భారీ గొయ్యిలున్న రహదారుల్లో ప్రయాణమంటే వాహన చోదకులతో పాటు ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. పనులు ముగించుకొని.. తిరిగి ఇళ్లకు చేరుకునేటప్పటికి ఒళ్లు హూనమవుతోంది. రాత్రివేళ గోతులను గుర్తించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇకనైనా అధికారులు, పాలకులు స్పందించి గ్రామీణ రోడ్లను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. 'భీమడోలు మండలంలో గోతులమయంగా మారిన గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించాం. వాటిని ఉన్నతాధికారులకు పంపి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటాం. వీలైనంత త్వరలోనే రోడ్లను బాగు చేస్తాం' అని ర.భ.శాఖ ఏఈ భాస్కరరావు తెలిపారు.



మహిళను పరీక్షిస్తున్న వైద్యుడు

సామాజిక సేవలో లయన్స్ ముందంజ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సామాజిక సేవా కార్యక్రమాల్లో లయన్స్ ముందుంటోందని ఉషా గ్రూప్స్ అధినేత డాక్టర్ ఉషా బాలకృష్ణ అన్నారు. స్థానిక రామకోటి ప్రాంగణంలో లయన్స్ జిల్లా ఛైర్మన్, ఎంజేఎఫ్ లయన్ మానేపల్లి రామారావు ఆధ్వర్యాన వేమగిరి పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల బృందం సహకారంతో ఆదివారం ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 135 మందికి పరీక్షలు చేయగా- 19 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. మరో 36 మందికి రాయితీపై కళ్లద్దాలు పంపిణీ చేశారు. రీజియన్ ఛైర్మన్, ఎంజేఎఫ్ లయన్ ఉడతా రత్నకుమార్, ప్రతినిధులు మురళి, వెంకటరామయ్య, సురేశ్‌కుమార్, వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మ.. రక్షించమ్మా!

రాట్నాల కుంట(పెదవేగి), న్యూస్‌టుడే: రాట్నాలకుంటలో వెలసిన రాట్నాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, పూజలు, అర్చనలు చేసి పట్టువస్త్రాలు, ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి, రాట్నాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వారికి అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూజ ద్రవ్యాలు, ప్రసాదాల విక్రయాలతో రూ.69,870 ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్.సతీశ్‌కుమార్ తెలిపారు.



పెదపాడు: అలంకరణలో అమ్మవారు

అమ్మవారి సేవలో బడేటి..

ఏలూరు గ్రామీణ: గంగానమ్మ ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. మారుతీనగర్, బగ్గయ్యపేటలో గంగానమ్మవారి సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన్ను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. అంతకు ముందు అమ్మవార్లకు పసుపు, కుంకుమ, నిమ్మకాయలతో అలంకరించారు.

★ సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. స్థానిక దక్షిణపువీధిలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆపై అయ్యప్ప మాలధారులకు భిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు.



ఏలూరు: గంగానమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే చంటి

వేణుగోపాలునికి క్షీరాభిషేకం..

ఏలూరు గ్రామీణ: శ్రీకృష్ణ జన్మ నక్షత్రం సందర్భంగా తూర్పువీధిలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి క్షీరాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో జలాభిషేకం నిర్వహించారు. ఆపై విశేషంగా అలంకరించి నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు.

ఘనంగా సంకటహర చతుర్థి

ఏలూరు గ్రామీణ: సత్రంపాడు అంబికాదేవి సన్నిధిలోని మహాగణపతి, దొండపాడు శ్రీనం దత్తనాథక్షేత్రంలో సిద్ధి వినాయకస్వామి ఆలయాల్లో ఆదివారం సంకటహర చతుర్థి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు పంచామృతాభిషేకాలు, గరిక పూజ చేశారు. భక్తులు సామూహిక గణపతి వ్రతం ఆచరించారు.

అపూర్వ సమ్మేళనం

ఏలూరు గ్రామీణ న్యూస్‌టుడే: శనివారపుపేట ప్రాథమిక పాఠశాలలో పాతికేళ్ల కిందట అయిదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకొని.. రోజంతా ఆనందంగా గడిపారు. గత స్మృతులను గుర్తుచేసుకుంటూ పాత మిత్రులను ఆప్యాయంగా పలకరించుకున్నారు. మధ్యాహ్నం సహ పంక్తి భోజనం చేశారు.



నేడు పశు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం

గణపవరం, న్యూస్‌టుడే: జల్లికొమ్మర రైతు సేవా కేంద్రంలో సోమవారం ఉచిత పశు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం ఏర్పాటు చేసినట్లు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డి.ఎం.నాయక్ తెలిపారు. శిబిరాన్ని ఎమ్మెల్యే ధర్మరాజు ప్రారంభిస్తారన్నారు. చూలు కట్టని, ఎదకు రాని పశువులను పరీక్షించి మందులు అందిస్తామని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

ఏలూరు సినిమాలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

అంబిక డీలక్స్	లవ్ రెడ్డి
అంబిక మినీ	రామనగర్ బన్నీ
సాయిబాలాజీ	మా నాన్న సూపర్ హీరో
బాలాజీ	శ్వాగ్
సత్యనారాయణ స్క్రీన్ 1	విశ్వం
సత్యనారాయణ స్క్రీన్ 2	వేట్టయన్
సత్యనారాయణ స్క్రీన్ 3	వేట్టయన్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	దేవర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	ఇద్దరు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	డీల్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	వేట్టయన్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	వేట్టయన్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	విశ్వం
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	విశ్వం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

దుగ్గిరాల(పెదవేగి), న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలోని విడిది కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి మాట్లాడారు. నియోజకవర్గంలోని అర్హులందరికీ త్వరలోనే పింఛన్లు మంజూరు చేయిస్తామన్నారు. స్థానిక సమస్యలు, ఆరోగ్య సంబంధ సమస్యలపై పలువురు అర్జీలు సమర్పించగా- వాటిపై సానుకూలంగా స్పందించారు.

దైవ ప్రార్థనతో ప్రశాంతత.. విజయరాయి(పెదవేగి): ఆధ్యాత్మిక చింతన, దైవ ప్రార్థనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. విజయరాయి ఆర్‌సీఎం చర్చి ఆవరణలో నూతనంగా నిర్మించనున్న ప్రార్థన మందిరానికి ఆదివారం శిలాఫలకం ఆవిష్కరించారు. ఆర్‌సీఎం సేవలను కొనియాడారు.



గతుకుల రోడ్లు.. ప్రయాణికుల పాట్లు

భీమడోలు, న్యూస్‌టుడే: స్థానిక బస్టాండు ఆవరణమంతా గతుకులమయంగా మారింది. బస్సులు లోపలికెళ్లి వచ్చే క్రమంలో ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. బస్సులు ఎత్తివేస్తుండటంతో నడుం కలుక్కుమంటుందంటూ వాపోతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలకు నిత్యం వేలాది మంది భీమడోలు మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. బస్టాండు గుంతలతో నిండిపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్వారకాతిరుమల దేవస్థానం ఎస్ఈ భాస్కరరావు వివరణ కోరగా- గోతులు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.



మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు పాపారావు

కొప్పుల వెలమలు అన్ని రంగాల్లో రాణించాలి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: కొప్పుల వెలమ కులస్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆ సంఘం పట్టణాధ్యక్షుడు భీమవరపు పాపారావు సూచించారు. స్థానిక కొప్పుల వెలమ కుల సంఘం కల్యాణ మండపంలో ఆదివారం మహాజన సమావేశం నిర్వహించారు. సంఘ ప్రధాన కార్యదర్శి మరడాని అచ్యుతరావు అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ.. కొప్పుల వెలమల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. పేద విద్యార్థులకు ఏటా ఉపకార వేతనాలు అందిస్తున్నామన్నారు. సంఘం తరఫున సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మాజీ మంత్రి మరడాని రంగారావు, సంఘ కోశాధికారి ఎం.రంగారావు, ఉపాధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులు ఎం.చంద్రశేఖర్, ఎ.తిరుపతిరావు, గౌరవ సలహాదారులు శివప్రసాద్, ఎల్.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పాతది శిథిలమై.. కొత్తది నిరుపయోగమై!

నారాయణపురం(ఉంగుటూరు), న్యూస్‌టుడే

ఉంగుటూరు మండలంలో మేజర్ పంచాయతీల్లో నారాయణపురం ఒకటి. ఈ గ్రామ పంచాయతీ నుంచి ఏటా సుమారు రూ.కోటి వివిధ పన్నుల రూపేణా ప్రభుత్వానికి ఆదాయం వస్తోంది. ఇంతటి ప్రాధాన్యమున్న గ్రామంలో కనీస సదుపాయాలు మృగ్యమయ్యాయి. గతంలో 90 వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. సచివాలయం-1 పరిధిలోని కుటుంబాలన్నింటికీ దీని ద్వారానే తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఏదైనా సమస్య వస్తే గుక్కెడు నీటికి గుటకలు మింగాల్సి వస్తోంది.

రూ.30 లక్షలతో నిర్మించినా..

గ్రామంలో నీటి ఎద్దడి నివారణకు జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.30 లక్షల వ్యయంతో సుమారు 60 వేల లీటర్ల సామర్థ్యంతో కొత్తగా ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. ట్రయల్ కూడా వేశారు. ఈ ట్యాంకుకు మోటార్ అమర్చకపోవడంతో అది కాస్త నిరుపయోగంగా మారింది. పాత ట్యాంకుకు అమర్చిన మోటార్ మరమ్మతుకు గురైతే తాగునీటి సమస్య తలెత్తుతోందని, కొత్త దానికి మోటారు బిగించాలని స్థానికులు కోరుతున్నారు. 'సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. కొత్త ఓవర్‌హెడ్ ట్యాంకుకు మోటార్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం' అని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావు తెలిపారు.



ప్రారంభానికి నోచుకోని ట్యాంకు



మురుగు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు


చెత్తగించే వారేరీ!

ఏలూరు నగరంలోని తూర్పువీధి నుంచి వెన్నవల్లివారిపేట వెళ్లే పంట కాలువ వంతెన పరిసర ప్రాంతాలు చెత్త నిల్వ కేంద్రాలను తలపిస్తున్నాయి. చెత్తాచెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, కవర్లతో నిండిపోయి కనిపిస్తున్నాయి. ఇక్కడ స్థానికులెవరూ చెత్త వేయకుండా నగరపాలక సంస్థ అధికారులు నిఘా నేత్రం సైతం ఏర్పాటు చేశారు. దాన్ని లెక్క చేయకుండా పంట, మురుగు కాలువల వెంబడి వ్యర్థాలు పడేస్తున్నారు. అందులో పందులు, కుక్కలు చేరి అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఫలితంగా దుర్వాసన రావడంతో పాటు దోమల బెడద అధికంగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాలువ గట్లను శుభ్రం చేయాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు నగరం**



పంట కాలువ గట్టున...

స్వచ్ఛ సంకల్పం మూలకు..!



నిడమర్రు మండలంలో చెత్త తరలించే రిక్షాలు మూలకు చేరాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో 'స్వచ్ఛ సర్వేక్షన్' కింద మండలానికి 25 రిక్షాలు కేటాయించారు. అవన్నీ మరమ్మతులకు గురై మూలకు చేరాయి. కొన్ని గ్రామాల్లో సంపద కేంద్రాల వద్ద నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి మరమ్మతులు చేసి రిక్షాలను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. ఎంపీడీవో విజయకుమారిని వివరణ కోరగా.. రిక్షాలకు మరమ్మతులు చేయించేందుకు ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. **- న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం**

మహిళ నేత్ర దానం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: తూర్పువీధి శివయ్య గుడి సందులో నివాసముంటున్న టి.నాగమణి ఈ నెల 19న మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యుల అనుమతితో ఆమె నేత్రాలు దానం చేశారు. విజయవాడ ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు ఆదివారం ఏలూరు చేరుకొని కార్నియా సేకరించారు.



నాగమణి

కదలని పశువులు.. ముందుకెళ్లని వాహనాలు!

ప్రమాదాల బారిన పడుతున్న చోదకులు

పవరుపేట(ఏలూరు అర్బన్), న్యూస్‌టుడే

ఏలూరు నగర వీధుల్లో పశు సంచారం నానాటికీ ఎక్కువవుతోంది. ప్రధాన రహదారులతో పాటు ఇరుక్కు సందుల్లోనూ తిరుగాడుతూ జనజీవనానికి విఘాతం కలిగిస్తున్నాయి. స్థానిక పవరుపేటలోని వల్లూరివారివీధి పశువులకు ఆవాసంగా మారింది. ఒకటి, రెండో పట్టణ ప్రాంతాల్లోని రైతు బజార్ల వద్ద పశువుల సమస్య జటిలంగా ఉంటోంది. రహదారులపై అడ్డదిడ్డంగా తిరుగుతుండటంతో.. వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.



వల్లూరివారి వీధిలో తిష్ఠ వేసిన ఆవులు

జరిమానా వట్టి మాటే

నగరంలో ఎక్కడైనా పశువులు సంచరిస్తే.. వాటిని గోశాలకు తరలిస్తాం.. యజమానులకు జరిమానా విధిస్తామంటూ నగర పాలక సంస్థ అధికారులు హెచ్చరిక జారీ చేశారు. ఈ ఆదేశాలు కేవలం మాటలుగానే మిగిలిపోయాయి. దాంతో యజమానులు రోజూ పశువులను వీధుల్లో వదిలేసి వెళ్లిపోతున్నారు. సాయంత్రానికి తిరిగి ఇళ్లకు తోలుకెళ్తున్నారు. ముఖ్యంగా ఆవులకు ఇళ్ల వద్ద మేత పెట్టకుండా వీధుల్లో వదిలేస్తుండటంతో.. అవి కుళ్లిన కూరగాయలు, ఇతరత్రా పదార్థాలు తిని అనారోగ్యం బారిన పడుతున్నాయి. 'నగర వీధుల్లో పశువులు వదిలిపెట్టే వారికి జరిమానా విధిస్తాం. దీంతోపాటు వీధుల్లో తిరిగే మూగజీవాలను గోశాలకు తరలిస్తాం. ఈ ప్రక్రియను త్వరలోనే ప్రారంభిస్తాం' అని నగర కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు.

పోలవరం

•పోలవరం • చింతలపూడి

జిల్లా మహా సభల విజయవంతానికి పిలుపు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: తూర్పురేగులకుంటకు చెందిన మహిళ సీపీఐ(ఎంఎల్) దుర్గ కార్యకలాపాలు సీపీఎం కు సంబంధం లేదని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి వెల్లడించారు. పార్టీ మండల కమిటీ సమావేశం బుట్టాయగూడెంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గ, కోర్సాలు తమ పార్టీ సభ్యులు కాదన్నారు. డిసెంబరు 13 నుంచి బుట్టాయగూడెంలో జరిగే జిల్లా 26వ మహాసభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు రామకృష్ణ, ప్రసాద్, నాగమణి, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు. కాగా ఎన్నో ఉద్యమాల్లో పాల్గొని తాను తెగించి పోరాటాలు చేశానని, తనపై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించే లేదని దుర్గ విలేకర్లతో అన్నారు.

సంప్రదాయాలపై అవగాహన అవసరం



అవ్వాతాతలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: మన సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల ప్రధానాచార్యుడు శంకర్రావు అన్నారు. ఆ పాఠశాలలో ఆదివారం అవ్వాతాతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దలపై గౌరవం, క్రమశిక్షణ, ఇతర అంశాలను వివరించారు. అనంతరం విద్యార్థుల అవ్వాతాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ముగిసిన మసీదు కమిటీ పదవీ కాలం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం బిలాల్ మసీదు కమిటీ గడువు ముగిసిందని వక్ఫ్ బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్ మహ్మద్ షఫీఉల్లా తెలిపారు. అధ్యక్షుడు షేక్ జిలాని నుంచి ఈ నెల 10న తాము ఛార్జి స్వాధీనం చేసుకున్నామన్నారు. కొత్త కమిటీ ఏర్పాటయ్యే వరకు తమ ఆధీనంలోనే కార్యకలాపాలు జరుగుతాయన్నారు. గత అధ్యక్షుడు షేక్ జిలాని పై మసీదు నిధులు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు వచ్చాయన్నారు.

పోలవరంలో ఆధార్ శిబిరం

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం రైతు సేవా కేంద్రంలో బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధార్ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో కె.శ్రీనివాస్ చెప్పారు. ఎక్కడి వారు అక్కడే స్థానిక సచివాలయాలకు వెళ్లి ఆధార్‌లో సవరణలు చేయించుకోవచ్చన్నారు.

22 నుంచి శిబిరాలు.. కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని విద్యార్థులు ఈ నెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాల్లో తమ వివరాలను నవీకరణ చేయించుకోవాలని మండల విద్యాధికారి జె.సురేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సగం పనులు.. పూర్తి చెల్లింపులు!

ఉపాధి పథకంలో అక్రమాలు

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో అవినీతి రాజ్యమేలుతోంది. సగం చేసిన పనులకు పూర్తి బిల్లులు చేయడం.. స్థానికంగా లేని వారి పేరిట మస్తర్లు వేయడం, గుర్తించిన పనులను పూర్తి చేయకుండా పథకాన్ని నీరుగార్చుతున్నారు. జీలుగుమిల్లి మండలంలో 7908 జాబ్ కార్డులు, 19479 మంది కూలీలు ఉన్నారు. ఉపాధి పనుల్లో సుమారు రూ.10 లక్షల అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీలో గుర్తించారు. సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకోపోవడంతో వారు మరింత బరితెగిస్తున్నారు. గతేడాది గుర్తించిన అవకతవకలపై అధికారులు తూతూమంత్ర చర్యలతో సరిపెట్టారన్న ఆరోపణలున్నాయి. తాజాగా ఉద్యాన మొక్కల పంపిణీలో సిబ్బంది చేతివాటం చూపించారు.



ఒకే రైతు.. రెండు బిల్లులు

ఈ కొబ్బరి తోట జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెం రైతు మామిళ్ల శ్యామలాదేవిది. 2.90 ఎకరాల్లో 180 మొక్కలను సుమారు వంద మంది కూలీలు వారం రోజుల పాటు పనిచేసి నాటారు. ఒకే జాబ్ కార్డు ఉన్న ఆమెకు రెండుసార్లు పంటవేసినట్లు బిల్లులు చేశారు. 10576 జాబ్ కార్డులో కూలీలకు రూ.1,62,277, మొక్కలకు రూ.1,10,918 చొప్పున రూ.2,73,196 మంజూరు చేశారు. 10327 జాబ్ కార్డుతో తిరిగి ఆమెకే కూలీలకు రూ.69,907, మొక్కలకు రూ.51,213 చొప్పున రూ.1,21,121 బిల్లు చేశారు. శ్యామలాదేవి మాత్రం తనకు కూలీల ఖర్చు రూ.50 వేలు అయ్యిందని, మొక్కలతో పాటు పెంపకానికి ఇచ్చే నగదు బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని సిబ్బంది చెప్పినట్లు తెలిపారు.



సామాజిక తనిఖీతో వెలుగులోకి..

జీలుగుమిల్లి మండలం పి.రాజవరంలో పుంతదారి ఇది. గతేడాది రెండు కిలోమీటర్ల మేర ఉపాధి హామీ పథకంలో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇరువైపులా ఉన్న తుప్పలు తొలగించి, మట్టి తీశారు. అది కూడా 1000 మీటర్లు మాత్రమే సాగించి వదిలేశారు. బిల్లులు మాత్రం 2000 మీటర్లకు చేశారు. సామాజిక తనిఖీలో బయటపడగా రూ.4 లక్షల రికవరీ పెట్టారు.

ఉద్యాన మొక్కల జాడేది



అంకన్నగూడెంలో నాలుగు నెలల కిందట తొమ్మిది మంది రైతులకు కొబ్బరి, జీడి మొక్కలు మంజూరు కాగా కొందరికే పంపిణీ చేశారు. మిగతా వారి పేర్లు కేవలం జాబితాలో చూపించి ఆమ్యేసుకున్నట్లు సమాచారం. దీనిపై మండల స్థాయి అధికారి ఆరా తీస్తే మొక్కలు చనిపోయాయని చెబుతున్నారు.

విచారణ చేస్తాం: 'ఉపాధి పథకంలో జరిగిన అవకతవకలపై విచారణ చేస్తాం. అవినీతి పాల్పడినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం'అని ద్వామా పీడీ వెంకట సుబ్బారావు తెలిపారు.

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: చింతలపూడి మెరక వీధిలో డ్రెయిన్లపై మూతలు లేక ప్రమాదకరంగా ఉన్నాయి. రహదారి ఇరుకుగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం.
- రామారావు, స్థానికుడు

సమాధానం: డ్రెయిన్లపై మూతలు ఏర్పాటు చేస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. - పావని, కమిషనర్

గుబ్బలమంగమ్మకు పూజలు



బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం కామవరం అడవిలోని గుబ్బలమంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకున్నారు. నైవేద్యాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

పోలవరం, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాలు ముగింపు పురస్కరించుకొని పోలవరం పంచాయతీ పరిధి పాత పూతగనూడెం కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు, బకాయిల విడుదల కోరుతూ ధర్నా



చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులు ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద ఆదివారం ధర్నా చేశారు. ఆదేవిధంగా వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుంచె వసంతరావు, దయామని, జ్యోత్స్న, మేరి, ప్రభావతి, శ్రీను, వెంకటేశ్వరరావు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం, న్యూస్‌టుడే: వేతన బకాయిలు విడుదల కోరుతూ పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రం పారిశుద్ధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. కొన్ని నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి ప్రభుత్వాసుపత్రి పారిశుద్ధ్య కార్మికుల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ నాయకుడు బాబు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు ఆసుపత్రి ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 30 నుంచి నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపడతామన్నారు. 31న సమ్మెకు దిగుతామని చెప్పారు. కార్మికులు మరియమ్మ, సుజాత, రాము, నాగరాజు, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఇఫ్టూ, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా చేశారు. ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రామ్మోహన్, ధర్మరాజు, టి.కృష్ణ, ఎం.సత్యవతి, కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.5 కోట్లతో సీసీ రహదారుల నిర్మాణం



పేరంపేటలో శంకుస్థాపన చేస్తున్న రోషన్‌కుమార్

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం నిధులు రూ.5 కోట్లతో జంగారెడ్డిగూడెం మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో సీసీ రహదారులు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. మండలంలోని పేరంపేట, చక్రదేవరపల్లి, లక్కవరం, జొన్నవారిగూడెం, పంగిడిగూడెం, టెక్కినవారిగూడెం తదితర గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీవిత కాల సభ్యత్వ స్వీకరణ

సీనియర్ నాయకుడు అబ్బిన దత్తాత్రేయ రూ.లక్ష చెల్లించి తెదేపా జీవితకాల సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అభినందించారు.

కుక్కునూరు, న్యూస్‌టుడే: 'పల్లెపండగ'లో భాగంగా కుక్కునూరు, కొండపల్లి గ్రామాల్లో ఆదివారం సీసీ రహదారుల పనులకు శంకుస్థాపన నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు, ఎంపీపీ గీతాబాల, తెదేపా మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, జనసేన నాయకుడు యుగంధర్, లక్ష్మణాచార్యులు,వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు, న్యూస్‌టుడే: రామవరం పంచాయతీ జీడిగుంపులో రూ.5 లక్షలు, మేడేపల్లిలో రూ.5 లక్షలతో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు అమరవరపు అశోక్, ఎంపీడీవో శ్రీహరి, సర్పంచులు పాల్గొన్నారు.

టి.నరసాపురం, న్యూస్‌టుడే: కేతవరంలో రూ.25 లక్షలతో నిర్మించే సీసీ రహదారులకు తెదేపా రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి శంకుస్థాపన చేశారు.

సమస్యల పరిష్కారంలో విఫలం: సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ చైతన్య

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలమయ్యారని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఆరోపించారు. ద్వారకాతిరుమల యూటీఎఫ్ భవనంలో సీపీఐ మండల ప్రధాన మహాసభ గొలిమే బాబుసు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలంటూ గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో కృష్ణ చైతన్య మాట్లాడుతూ సీపీఐ బలోపేతానికి శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ద్వారకాతిరుమలలో మౌలిక వసతులు, డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదన్నారు. మండలంలోని వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని, అధికారులు విచారణ చేసి స్వాధీనం చేసుకోవాలన్నారు. నాయకులు బండి వెంకటేశ్వరరావు, కలిగ లక్ష్మణరావు, జేవీ రమణరాజు, టీడీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



పాతనేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కృష్ణబాబు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు, పాతనేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ కృష్ణబాబు అన్నారు. ఈ మేరకు జంగారెడ్డిగూడెం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరప్రవృత్తి వీడకపోతే పలు కేసులు నమోదు చేస్తామని, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దళితవాడలకు మహర్దశ



తారకరామనగర్‌లో అంతర్గత రహదారి కొలతలు సేకరిస్తున్న ఈవోపీఆర్డీ సతీష్, సిబ్బంది

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాల్లోని దళితవాడల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఎస్సీ ఉపప్రణాళిక నిధులతో ఆయా ప్రాంతాల్లో అవసరమైన సిమెంట్ రహదారులు, డ్రెయిన్లు, తాగు నీరు తదితర సౌకర్యాల కల్పన నిమిత్తం వివరాల సేకరణకు సాంఘిక సంక్షేమ శాఖ చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో ఈవోపీఆర్డీ జి.సతీష్ సారథ్యంలో గ్రామ సచివాలయాల కార్యదర్శులు, సంక్షేమ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించారు. ఆయా పనులకు అవసరమైన ప్రతిపాదనలు, అంచనా వ్యయం రూపొందించి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఈవోపీఆర్డీ ఆదివారం తెలిపారు.

దారి పక్కనే ఉన్నా కనిపించలేదా?



కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: దిప్పకాయలపాడులో కిచ్చప్పగూడెం వెళ్లే మార్గంలోని విద్యుత్ పరివర్తకాన్ని తుప్పలు కమ్ముకున్నాయి. రహదారి పక్కనే ఉన్నప్పటికీ సంబంధిత సిబ్బంది ఇది కనిపించకపోవడం గమనార్హం. ఈదురుగాలులు, వర్షాలు వచ్చినప్పుడు ఇది సరఫరా నిలిచిపోతుండడం పరిపాటిగా వస్తోంది. ఏమంటే ట్రిప్ అయిందన్న సమాధానం సిద్ధంగా ఉంటుంది. ప్రతి శుక్రవారం చేసే పనుల్లో ఇటువంటివి సిబ్బంది దృష్టికి రాకపోవడం ఆశ్చర్యమే. దీనిపై కొయ్యలగూడెం విద్యుత్ ఏఈ ఎస్వీ రామారావు మాట్లాడుతూ పరివర్తకం చుట్టూ అల్లుకున్న తుప్పలను తొలగించడానికి తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు.

అడవి కాదు.. మార్కెట్ యార్డు ఆవరణ!



శిథిలస్థితిలో గోదాము



తుప్పల మధ్య రైతుల విశ్రాంతి భవనం



పశు వైద్యం కోసం కేటాయించిన క్రికెట్ పరిసరాల్లో పెరిగిన తుప్పలు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పోలవరం మార్కెట్ యార్డు ప్రాంగణం నిర్వహణ లేక అడవిని తలపిస్తోంది. కొయ్యలగూడెంలో జాతీయ రహదారిని ఆనుకుని సుమారు ఆరుఎకరాల పైబడి విస్తీర్ణం కలిగిన సువిశాల ఆవరణలో తుప్పలు పెరిగి విష పురుగులకు నిలయంగా మారింది. పట్టించుకునే నాథుడు లేక వెలవెలబోతోంది. ఏటా వార్షిక లావాదేవీలు సుమారు రూ.5కోట్లు పైమాటే. కానీ కనీసం కార్యాలయానికి కూడా నోచుకోలేని దుస్థితి. ఇదే ప్రాంగణంలో ఓ శిథిల గోదాములో పక్కన సర్దుకుని రోజులు నెట్టుకొస్తున్నారు. ఏవో పాలకవర్గాలు ప్రభుత్వాలు, ఏఎంసీ పాలకవర్గాలు మారుతున్నాయి తప్ప.. మార్కెట్ యార్డు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఇదే ప్రాంగణంలో వైకాపా ప్రభుత్వ హయాంలో ఆర్భాటంగా ప్రారంభించిన అగ్రి కల్చరల్ హబ్ గోదాము కూడా శిథిలమైంది. వర్షాలకు కప్పులన్నీ తదితర సామగ్రి తడిసి పోతున్నాయని మేనేజరుగా వ్యవహరిస్తున్న ఏవో సోమశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డు ప్రాంగణంలో నెలకొన్న సమస్యలపై ఏఎంసీ కార్యదర్శి మోహనరావు మాట్లాడుతూ ప్రాంగణం నిర్వహణకు నిధుల కొరత ఉందన్నారు. ఉన్నంతలో సర్దుబాటు చేసుకుంటూ శుభ్రం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. భవనాలన్నీ శిథిలమయ్యాయన్నారు. కార్యాలయ భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరై ఏడాది గడిచిందన్నారు. పలు పర్యాయాలు టెండర్లకు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదని చెప్పారు. ఏఎంసీ అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ప్రాంగణంలోని తుప్పలను తొలగించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



పోలీసుల ప్రదర్శన

'పోలీసులతో మిత్రులుగా మెలగండి'

టి.నరసాపురం, న్యూస్‌టుడే: పోలీసు అమర వీరుల సంస్మరణ దినాన్ని టి.నరసాపురంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుల త్యాగాలను గుర్తుచేసుకున్నారు. ఎస్సై ఎం.జయబాబు మాట్లాడుతూ సమాజ సేవలో పోలీసుల ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్నారు. సమస్యలు ఎదురైతే ప్రజలు నిర్భయంగా తమకు తెలియజేయాలని సూచించారు. అనంతరం పోలీసులతో మిత్రులుగా మెలగాలన్నారు. చేస్తూ నినాదాలు గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.



నిండుకుండలా జల్లేరు జలాశయం

జల్లేరు నుంచి నీటి విడుదల

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం ప్రాంతంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. బుట్టాయగూడెం మండలం అలివేరు గుబ్బలమంగమ్మ జల్లేరు జలాశయానికి ఎగువ నుంచి 250 క్యూసెక్కుల మేర వరద వచ్చి చేరింది. దీంతో నీటి మట్టం 217.25 మీటర్లకు చేరింది. రెండు గేట్లు పైకి ఎత్తి 200 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నట్లు జలవనరుల శాఖ ఏఈ సురేష్ తెలిపారు. చింతలగూడెం సమీపాన పోగొండ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరింది.



బొర్రంపాలెంలో పూడ్చిన గుంతలు

గుంతలు పూడ్చించిన జనసేన నాయకుడు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: మండలంలోని బొర్రంపాలెం ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా మారిన గుంతలను జనసేన పార్టీ స్థానిక యువ నాయకుడు కపసాటి రమేష్ తన సొంత నిధులు సుమారు రూ.30వేలు వెచ్చించి ఆదివారం పూడ్చించారు. నిత్యం ఆ ప్రదేశంలో వాహన ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా మరమ్మతులు చేయించినట్లు ఆయన పేర్కొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం మకివలసలో ఆదివాసీ మహిళలపై విచక్షణ రహితంగా దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్తు డివిజన్ కార్యదర్శి తెల్లం లక్ష్మణరావు కోరారు. బుట్టాయగూడెంలో ఆదివారం సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరిగిన ఘటన దురదృష్టకరమన్నారు. ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్తు జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి కొవ్వాడయ్య, సహాయ కార్యదర్శి పూసం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి స్వీయ మూల్యాంకనం-2 పరీక్షలు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో వచ్చే నెల 4 నుంచి స్వీయ మూల్యాంకనం-2(ఎస్ఏ-2) పరీక్షలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి జె.సురేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

జూద స్థావరంపై దాడి

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి మండలం గణిజర్లలో జూద స్థావరంపై ఆదివారం దాడిచేసి, ఆరుగురిని అరెస్టు చేసి, రూ.70వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కుటుంబరావు తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

వేలేరుపాడు, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ మద్యాన్ని వేలేరుపాడు వ్యవస్థలు వద్ద పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ముత్తలబోయిన రాము, కొవ్వాల శివరామకృష్ణలు తెలంగాణ మద్యం తరలిస్తున్నారనే సమాచారంతో దాడిచేసి 79 సీసాలు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై కేవీ రామారావు తెలిపారు.

ఖోఖో జిల్లా జట్టు ఎంపిక



టి.నరసాపురం: ఎంపికైన క్రీడాకారులు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా కాణిపాకంలో ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహించే 43వ రాష్ట్ర స్థాయి అండర్-18 ఖోఖో పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ఎంపిక పోటీలు టి.నరసాపురం మండలం బొర్రంపాలెం ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు కె.రమేష్ ప్రారంభించారు. జిల్లా నుంచి బాలికలు 40 మంది, బాలురు 50 మంది హాజరు కాగా 15మంది బాలికలు, 15 మంది బాలురు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయుడు గొడుగు శ్రీనివాస్ తెలిపారు. ఖోఖో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సాంబశివరావు, రంగారావు, ప్రధానోపాధ్యాయుడు అలీ ఆధ్వర్యంలో ఎంపిక నిర్వహించారు.

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఖోఖో జూనియర్ జట్టుకు రాజవరం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కె.దయసత్యసాయి, యు.యశ్వంత్, వై.షరీఫ్, పూర్ణ విద్యార్థిని జి.అంజలి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బి.రామారావు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

శిథిల భవనం.. చీకట్లో వైద్యం!



శిథిలావస్థకు చేరిన జీలుగుమిల్లి పశు వైద్యశాల



ఇనుప ఊచలు పైకి వచ్చి కనిపిస్తున్న శ్లాబు

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: పశు వైద్యం గాల్లో దీపంలా మారింది. చాలీచాలని గదులు, శిథిలావస్థకు చేరిన భవనంలో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్ల దీస్తున్నారు. చిన్నపాటి చినుకులు పడితే చాలు ఆసుపత్రి అంతా చిత్తడిగా మారడంతో పాటు ఎప్పుడు కూలిపోతాయో తెలియని గోడలతో భయాందోళన చెందుతున్నారు. జీలుగుమిల్లిలో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుని కార్యాలయం ఉంది. దీన్ని బుట్టాయగూడెం, వేలేరుపాడు మండలాలకు అనుసంధానంగా ఏర్పాటు చేశారు. అయితే సరైన భవనం లేదు. పశువులకు చికిత్స చేసే షెడ్డులోనే సమావేశాలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఇక వర్షం కురిస్తే చాలు సెలవు ప్రకటించే పరిస్థితి. ఒకవేళ ఉద్యోగులు విధులకు వచ్చినా పక్క షెడ్డులోకి వెళ్లి పోవాల్సిందే. ఆ సమయంలో విద్యుత్తు సరఫరా కూడా నిలుపుదల చేయాల్సిందే. అంతలోనే శ్లాబు ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. దీనిపై పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు సాయిబుచ్చారావు మాట్లాడుతూ కార్యాలయ దుస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించామన్నారు. సమస్యను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేసి నూతన భవనం నిర్మాణానికి కృషిచేస్తానని చెప్పారన్నారు.

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

నేరాలకు పాల్పడితే చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై రామకృష్ణ

చాట్రాయి, న్యూస్‌టుడే: నేరాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, మంచి ప్రవర్తనతో ఉండాలని ఎస్సై డి.రామకృష్ణ అన్నారు. చాట్రాయి స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. సత్ప్రవర్తనతో జీవిస్తే రౌడీషీట్‌ను తొలగించేందుకు సిఫార్సు చేస్తామన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీ హెల్పింగ్ హ్యాండ్స్, అశ్విని ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా పెదన మండలం దామోజీపాలెంలో ఆదివారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 700 మందికి కంటి పరీక్షలు చేశారు. 350 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కంటి నిపుణుడు ఎ.శ్రీనివాస్, అశ్విని ఫౌండేషన్ ట్రస్టీ పి.రమేష్, హెల్పింగ్ హ్యాండ్స్ వాలంటీర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు: 99486 40551 | కైకలూరు: 73060 88555
ముసునూరు: 93983 81268 | కలిదిండి: 90594 84862

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే

సమస్య: ఆగిరిపల్లి- ఈదులగూడెం రహదారిలో జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి పెట్రోల్ బంక్ వరకు ప్రధాన రహదారిపై మురుగు నీరు పారుతోంది. పాదచారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. సమస్యను పరిష్కరించండి

- శ్రీనివాసరావు, ఆగిరిపల్లి

సమాధానం: రహదారిపై మురుగు పారకుండా చర్యలు తీసుకుంటాం.

- బొల్లినేని ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి

బాబోయ్ ఇవేం దారులు..!

చెరువులను తలపిస్తున్న ప్రధాన రహదారులు



గోపవరం రోడ్డులో వాహనదారుల ఇక్కట్లు

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు మండలంలోని ప్రధాన రహదారులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. భారీ గోతులతో చెరువులను తలపిస్తున్నాయి. ఆ దారులపై వాహనదారులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కనీస మరమ్మతులకు సైతం నోచక ఈ దుస్థితి ఏర్పడిందని చోదకులు వాపోతున్నారు.

ప్రమాదకర ప్రయాణం

కైకలూరు నుంచి గోపవరం మీదుగా కలిదిండి చేరుకునే రహదారి రెండు మండలాల ప్రజలకు చాలా ముఖ్యమైనది. గత నాలుగేళ్లుగా దీనికి కనీస మరమ్మతులు చేసిన నాథుడు లేడు. కైకలూరు- గోపవరం రైల్వే గేటు వద్ద నుంచి పుల్లవా మురుగు కాలువ, గోపవరం ఇందిరాగాంధీ చెరువు నుంచి ఎస్ మలుపు వరకు, రాచపట్నం నుంచి ఆకుతోగలపాడు జడ్పీ పాఠశాల వరకు 8 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు దుస్థితి దారుణంగా ఉంది. కనీసం ద్విచక్ర వాహనం సైతం సక్రమంగా వెళ్లే అవకాశం లేదు.

ఆసుపత్రి మార్గం సైతం



సీతనపల్లి ఆసుపత్రికి చేరుకునే మార్గం ఇలా..

వరహాపట్నం- సీతనపల్లి మూడు కిలోమీటర్ల మార్గంలో వాహనాలు వెళ్లాలంటే ఇక్కట్లు తప్పడం లేదు. వాహనాలు పట్టుమని 20 కిలోమీటర్ల వేగం వెళ్లలేకపోతున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 10 గ్రామాల ప్రజలు, గర్భిణులు, బాలింతలకు ఏకైక ఆధారమైన సీతనపల్లి ఆసుపత్రికి ఈ మార్గంలోనే చేరుకోవాలి. ప్రతి బుధ, గురువారాల్లో ప్రసూతి సేవలకు వచ్చేందుకు గర్భిణులు హడలిపోతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఉప్పుటేరు నుంచి వరహాపట్నం వరకు 8 కిలోమీటర్ల మేర రోడ్డు ఏర్పాటుకు నాబార్డు నిధులు మంజూరైనా.. గుత్తేదారుడు దొడ్డిపట్ల శివారు వరకు మాత్రమే తారు రోడ్డు వేసి చేతులు దులుపేసుకున్నారు. రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రజలు వేడుకున్నా.. అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులను సంప్రదించగా.. వర్షాలు తగ్గిన అనంతరం రోడ్డు మరమ్మతులు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించనుందని, అన్ని రహదారులను అభివృద్ధి చేస్తామన్నారు.

కోతుల పట్టివేత

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లిలో పంచాయతీ ఆధ్వర్యంలో కోతులను పట్టుకున్నారు. ఇటీవల కాలంలో కోతుల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడంతో పాటు వరుసగా ప్రజలపై దాడులు చేసి గాయపరిచాయి. అంతేకాకుండా ఇళ్లలోకి చొరబడి సామగ్రి, ఆహార పదార్థాలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కర్రలు పట్టుకుని బిక్కుబిక్కుమంటూ తిరుగుతున్నారు. దీంతో గత రెండురోజులుగా కోతులను పట్టుకుంటున్నారు. నెల్లూరుకు చెందిన బృందం సుమారు 70 కోతులను పట్టుకుంది. ఆదివారం వాటిని అడవుల్లో వదలడానికి తీసుకెళ్లారు. మరో రెండు రోజుల పాటు పట్టివేత కార్యక్రమం కొనసాగుతుందని పంచాయతీ కార్యదర్శి రమేశ్ తెలిపారు.





నినాదాలు చేస్తున్న నాయకులు, రైతులు

మినుము రైతులను ఆదుకోవాలని ఆందోళన

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: రామిలేరుకు వచ్చిన వరదతో నష్టపోయిన మినుము రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నూజివీడు మండలంలోని పల్లెర్లమూడి శివారు శోభనాపురంలో ఆదివారం రైతులు నిరసన వ్యక్తం చేశారు. నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యుడు మంటా పాపారావు మాట్లాడారు. వరదతో మినుము పంట దెబ్బతిని రైతులు నష్టపోయినా.. పంట నష్టం నమోదు చేయకపోవడం అన్యాయమన్నారు. రామిలేరుకు పడిన గండ్లను పూడ్చాలని కోరారు.

యాదవ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా శ్రీహరి



సత్కరిస్తున్న నాయకులు

కైకలూరు, న్యూస్‌టుడే: శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా కలిదిండి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచి కరేటి శ్రీహరి నియమితులయ్యారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతు కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో శ్రీహరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అభివృద్ధికి కృషి చేసేలా నిరంతరం కృషి చేస్తానని శ్రీహరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెదేపా నేత బీకేమ నాని, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు నున్న రమాదేవి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ తలారి వెంకటస్వామి నూతన అధ్యక్షుడిని అభినందించారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు బోయిన రామకృష్ణ, బూరుబోయిన శ్రీనివాస్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'అమాత్యుని స్పందన భేష్'



సమావేశంలో పాల్గొన్న తెదేపా నాయకులు

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం గుడిపాడు, గుళ్లపూడి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించిన మంత్రి కొలుసు పార్థసారథికి రుణపడి ఉంటామని తెదేపా రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి గద్దె రఘుబాబు, సీనియర్ నాయకుడు కొల్లి గంగారావు అన్నారు. ఆదివారం గుడిపాడులో రఘుబాబు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా గ్రామాల్లో నెలకొన్న మురుగు కాలువలు, తాగునీరు, రోడ్లు వంటి పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగానే అధికారులతో మాట్లాడి వెంటనే వాటిని పరిష్కరించారన్నారు. సమస్యలను పరిష్కరించిన మంత్రికి స్థానికుల ధన్యవాదాలు తెలిపారు. మండలంలు ధర్మరాజు, కొల్లి ప్రసాద్, రామ్మోహన్, రామకృష్ణ, దర్గారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వాల నమోదు

కలిదిండి, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వాల నమోదుకు గ్రామీణ ప్రాంతాల్లో విశేష స్పందన లభిస్తోందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు నంబూరి చాందురాజు అన్నారు. కలిదిండి, పోతుమర్రు గ్రామాల్లో ఆదివారం భాజపా క్రియాశీలక సభ్యత్వాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. భాజపా నాయకులు చిట్టూరి రవీంద్ర, పన్నాస పూర్ణచంద్రరావు, గొంట్లాల అయ్యప్ప, పంచకర్ల శివాజీ తదితరులు బృందాలుగా ఏర్పడి సభ్యత్వాలు నమోదు చేయించారు.

పల్లెల్లో శంకుస్థాపనల సందడి



పులపర్రు: భూమి పూజ చేస్తున్న కూటమి నేతలు

కలిదిండి, న్యూస్‌టుడే: పల్లెల్లో రోడ్ల సందడి నెలకొంది. ఆకుమర్రు, సానారుద్రవరం, పోతుమర్రులో పల్లె పండగ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా నూతన రహదారి నిర్మాణాలకు భూమి పూజ చేశారు. కూటమి నాయకులు పోకల జోగిరాజు, వల్లభనేని నాని, చలమలశెట్టి లక్ష్మీ పార్వతి, నరహరిశెట్టి కాళ్ధరరావు, నంబూరి భీమరాజు, పామర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: గ్రామాల అభివృద్ధికి ఆ గ్రామంలోని సీసీ రోడ్లే సూచికలని జడ్పీటీసీ సభ్యురాలు ముంగర విజయ నిర్మల అన్నారు. మండవల్లి మండలం పులపర్రులో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. సర్పంచి వేంద్ర నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు దార రమేష్, నాయకులు ముంగర మల్లికార్జునరావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా మారుస్తాం: కామినేని



శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే శ్రీనివాస్, నాయకులు

కైకలూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రెయినేజీల వంటి మౌలిక వసతులు కల్పించి గ్రామాలను ఆదర్శంగా మారుస్తామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, కూటమి నాయకులతో కలిసి ఆదివారం మండలంలోని ఆటపాక, వింజరం, వేమవరప్పాడులో నూతన సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కామినేని మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. రానున్న రోజుల్లో నూతన రోడ్ల ఏర్పాటు, తాగునీటి వసతి, ఆక్వా విద్యుత్తు రాయితీ, పంట, మురుగు కాలువల ప్రక్షాళన, కొల్లేరు అభివృద్ధితో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. తెదేపా నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఎంపీపీ అడివి కృష్ణ, కూటమి నాయకులు త్రినాథరాజు, తెరా రమేష్, పి.రాధాకృష్ణ, బూరుబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు. ★ పల్లె పండగ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండలంలోని పెంచికలమర్రులో తెదేపా రాష్ట్ర సాధికార కన్వీనర్ బలే ఏసురాజు సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు. జయమంగళ సుబ్బరాజు కూటమి నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని కుమార్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థి కొల్లా భావన్ జాతీయ స్థాయి చదరంగ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఛైర్మన్ పిన్నమనేని వెంకటకుమార్ తెలిపారు. పాఠశాలలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గుంటూరు జిల్లా గోరింట్లలో నిర్వహించిన అండర్-15 చదరంగ పోటీల్లో భావన్ ప్రతిభ చాటినట్లు పేర్కొన్నారు. తమిళనాడులో నవంబర్ 3 నుంచి 11 వరకు జరగనున్న జాతీయ స్థాయి చదరంగ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొననున్నట్లు వివరించారు.



భక్తిశ్రద్ధలతో ఉరుసు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లిలోని హజరత్ మహాబూబ్ సుభానీ దర్గాలో ఉరుసు మహోత్సవాన్ని ఆదివారం సందడిగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన గుర్రపు బండిపై గంధాన్ని ఉంచి గ్రామంలో ఊరేగించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. షాజహాన్, ఖాన్‌బాషా, షేక్ బాషా, బాబావలి, జానీ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలెం- చేవూరిపాలెం ప్రధాన కూడలిలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో స్వామివారి జన్మ నక్షత్రం సందర్భంగా ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి శాంతి కల్యాణం వైభవంగా జరిపించారు. కల్యాణ క్రతువులో పలువురు దంపతులు పాల్గొనగా భారీగా భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థాన ఈవో ఆర్.గంగాశ్రీదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అభ్యుదయ కవి ఆకాష్‌కు సత్కారం

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలోని బుద్ధాల కన్వెన్షన్ హాలులో ఆదివారం ప్రపంచ తెలుగు సోపాతీ కళా జాతర కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో పాల్గొన్న నూజివీడుకు చెందిన అభ్యుదయ కవి శిఖా ఆకాష్‌ను అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, కార్యనిర్వాహకురాలు రమాదేవి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీబాయి తదితరులు ఘనంగా సన్మానించారు.

సినిమాలు

నూజివీడు పట్టణం	
సత్యనారాయణ	దేవర
సత్యనారాయణ మినీ	జనక అయితే గనక
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	....
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	విశ్వం
ద్వారక సినిమాస్ స్క్రీన్ 3	వేట్టయన్
ఆగిరిపల్లి: శ్రీలను డీలక్స్	మార్టిన్
కైకలూరు	
విజయలక్ష్మి జీ3 సినిమాస్	దేవర
మాగంటి సినిమాస్	వేట్టయన్
శ్రీవెంకటరమణ సినిమాస్	విశ్వం
ముదినేపల్లి: పూర్ణిమ	దేవర

పునర్వ్యవస్థీకరణ.. గందరగోళం!

నూతన సముదాయాల ఏర్పాటులో నిబంధనలకు తూట్లు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: విద్యా వ్యవస్థను పటిష్ఠం చేయాలని విద్యాశాఖ చేపట్టిన పాఠశాల సముదాయాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పలువురు అధికారుల నిర్లక్ష్యం కారణంగా పలు మండలాల్లో తీవ్ర గందరగోళంగా జరిగింది. ఉపాధ్యాయులు, పాఠశాలలపై పర్యవేక్షణ మరింత సులభం చేయాలనే ఉద్దేశంతో గతంలో ఉన్న కాంప్లెక్సులు కుదించి, మినీ విద్యా కార్యాలయాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో చేపట్టిన ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా సాగిందని పలువురు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

ప్రజాప్రతినిధుల వద్దకు పంచాయితీ

ముదినేపల్లి మండలంలో సుమారు 233 మంది ఉపాధ్యాయులు పని చేస్తుండగా పునర్వ్యవస్థీకరణతో బొమ్మినంపాడు, పెదగొన్నూరు, ముదినేపల్లి, పెదపాలపర్రు సముదాయాలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు అదనంగా అల్లూరు సముదాయాన్ని ఎంఈవో-1 చొరవతో ఏర్పాటు చేశారు. ఎంఈవో-2 అసంబద్ధంగా కొన్ని కాంప్లెక్సులను కలపడంతో పాటు పెదపాలపర్రు తొలగించి చిగురుకోట ఏర్పాటు చేయడంతో అక్కడ గందరగోళం నెలకొంది. దీంతో ఉపాధ్యాయులు శిక్షణ తదితర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కాంప్లెక్సుకు వెళ్లాలంటే వ్యయప్రయాసలు తప్పవని, ఆ ప్రభావం విద్యాబోధనపై పడే ప్రమాదం ఉందని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరికి పంచాయితీ ఎమ్మెల్యే వద్దకు చేరింది. సముదాయాల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి ఎంఈవోలు కనీస సమావేశాలకు హాజరు కాకపోవడంతో అనాలోచిత నిర్ణయం తీసుకుని ఉపాధ్యాయులకు ఇబ్బంది కలిగించేలా పాఠశాలలకు దూరంగా కాంప్లెక్సు ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే వద్ద ఉపాధ్యాయులు వాపోయారు. ఒక ఎంఈవోకు వేరే మండలాల్లో సైతం అదనపు బాధ్యతలు ఉండటంతో విధులకు సక్రమంగా హాజరు కాకుండా కార్యాలయ సిబ్బందిపై ఆధార పడటంతో సమస్య వస్తోందని కామినేని దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల విద్యా వ్యవస్థ దెబ్బ తినకుండా సరైన పద్ధతిలో కాంప్లెక్సులు ఏర్పాటు చేయాలని డీఈవోను కామినేని కోరారు.

★ నూజివీడు మండలంలో ముందుగా అయిదు కాంప్లెక్సులు ఏర్పాటు చేశారు. అయితే లోపాలను సరిచేసి శుక్రవారం వీటిని ఆరుగా పెంచారు. కలిదిండి మండలంలోనూ తొలుత నాలుగు ఏర్పాటు చేయగా తర్వాత వాటిని అయిదుకు పెంచారు.

రెండు నియోజకవర్గాల్లో ఇలా..

మండలం	పాత సముదాయాలు	కొత్తవి
ముదినేపల్లి	8	4
కైకలూరు	6	4
మండవల్లి	5	3
కలిదిండి	6	5
నూజివీడు	8	6
ముసునూరు	6	3
ఆగిరిపల్లి	6	3
చాట్రాయి	6	4

గతం కంటే తగ్గి..

ప్రతి పాఠశాల సముదాయంలో కనీసం 40 మంది ఉపాధ్యాయులు, కనీసం ఎకరం స్థలం విస్తీర్ణం ఉండాలి. పది కిలోమీటర్ల లోపు ఉండాలనే నిబంధనలతో సముదాయాల పునర్వ్యవస్థీకరణ చేపట్టారు. దీని ఆధారంగా ప్రస్తుతం ఉన్న సముదాయాల సంఖ్య గతం కంటే తగ్గింది. దీనివల్ల పర్యవేక్షణ మరింత సులభం అవుతుందనే ఉద్దేశంతో ముందుకు సాగారు. అయితే కొంత మంది ఎంఈవోల అనాలోచిత నిర్ణయాలతో పలు చోట్ల ఒక సముదాయంలో 80 మంది వరకు ఉపాధ్యాయులతో పాటు అయిదు, ఆరు ప్రైవేటు పాఠశాలలు వాటి పరిధిలోకి తీసుకొచ్చారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం దెబ్బతినే ప్రమాదం ఉందని పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం!

పారిశుద్ధ్య పనులపై పర్యవేక్షణ కొరవడి పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ముసునూరు మండలం రమణక్కపేట శివారులో రహదారుల పక్కన చెత్త పేరుకుపోయి మురికి కూపాలుగా మారాయి. పరిశుభ్రత లోపించడంతో దోమల బెడదతో స్థానికులు రోగాల పాలవుతున్నారు. ఏదైనా వ్యాధి వచ్చినప్పుడు మాత్రమే అధికారులు హడావుడి చేసి చేతులు దులుపుకొంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. సంపద కేంద్రాలకు తరలించాల్సిన చెత్తను సైతం రహదారుల వెంబడి పడేస్తుండటంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

- న్యూస్‌టుడే, ముసునూరు



తాళం వేసిన ఇంట్లో చోరీకి విఫలయత్నం

ముసునూరు, న్యూస్‌టుడే: తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. ఎస్సై ఎం.చిరంజీవి కథనం ప్రకారం.. ముసునూరు మండలం రమణక్కపేటకు చెందిన బిరుదు నాగవెంకట మల్లికార్జునరావు ఈనెల 15న కుటుంబ సభ్యులతో కలిసి మలేసియా వెళ్లారు. శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి చోరీకి యత్నించారు. ఆదివారం ఉదయం స్థానికులు ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించి నాగవెంకట మల్లికార్జునరావు సోదరుడు మహేశ్వరరావుకు తెలియజేశారు. ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. దొంగలు అన్ని గదులను జల్లెడ పట్టి.. ఇల్లంతా చిందరవందర చేసినట్లు గుర్తించారు. మలేసియాలో ఉన్న నాగవెంకట మల్లికార్జునరావు నుంచి ఫోన్‌లో వివరాలు తీసుకున్నారు. ఇంట్లో ఓ గదిలో ఉంచిన నగదు, బంగారం భద్రంగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఇంట్లో ఏ చోరీ జరగలేదని నిర్ధారించారు. క్లూస్ టీం సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించింది. దీనిపై ఎస్సై మాట్లాడుతూ.. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నామని, చోరీకి యత్నించిన వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు.

జూద స్థావరంపై దాడి

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు మండలం పాత రావిచర్లలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. గ్రామీణ ఎస్సై కథనం ప్రకారం.. జూద క్రీడలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.84,560 నగదు, తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

జాతీయ రైతు సదస్సును విజయవంతం చేయండి

కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: విజయవాడ వేదికగా ఈ నెల 22న జరగనున్న జాతీయ రైతు సదస్సును విజయవంతం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, జిల్లా మాజీ అధ్యక్షుడు గుత్తికొండ వెంకట కృష్ణారావు కోరారు. కైకరం తూర్పు వీధిలో ఆదివారం కౌలు రైతుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సమగ్ర కౌలు చట్టం తీసుకొచ్చేందుకు ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని తీర్మానించనున్నట్లు చెప్పారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.



తక్కెళ్లపాడు పథకం చెరువులో పశువులు ఇలా..

నీటి కిట్లు ఏమైనట్లు!

ఏళ్లుగా వినియోగించని వైనం

మండవల్లి, న్యూస్‌టుడే: ప్రతి మనిషికి రోజూ స్వచ్ఛమైన నీటిని ప్రభుత్వాలు అందించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. కానీ ఆచరణలో ఎక్కడ అది అమలు కావడంలేదు. కనీసం గ్రామాల్లో నీటిని పరిశీలించే పరిస్థితి కూడా ఏ పంచాయతీలో కనిపించడం లేదు. పంట కాలువలు నీటితో పాటు భూగర్భ జలాలు కూడా కలుషితమవుతున్న నేపథ్యంలో గ్రామాల్లోని నీటి నాణ్యతను పరిశీలించేందుకు ప్రభుత్వం కిట్లను పంచాయతీలకు సరఫరా చేసింది. వీటి ద్వారా మంచినీటి పథకాలు నీటిలో ఉండే గాఢత, క్షార శాతం, బురద, మట్టి పరిశీలనతో పాటు క్లోరిన్, ఫ్లోరైడ్ పరిమాణం కూడా లెక్కించొచ్చు. కిట్లను ఉపయోగించకపోవడంతో ఈ కార్యక్రమం పూర్తిగా అటకెక్కింది.



వాడిన దాఖలాలు లేవు

కైకలూరు నియోజకవర్గంలో 110 పంచాయతీలున్నాయి. ఇందులో అన్ని కాలాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనే కొల్లేరు లంక గ్రామాలు 30, తీర గ్రామాలు మరో 20 వరకు ఉన్నాయి. ఆయా పంచాయతీలకు నీటిని పరిశీలించేందుకు ప్రభుత్వం పంపిణీ చేసిన నీటి కిట్లను కనీసం వాడిన దాఖలాలు లేవు. సిబ్బందికి వీటిని ఎలా ఉపయోగించాలో కూడా తెలియని పరిస్థితి. సంవత్సరానికి ఆరు నెలలకు ఒకసారి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వచ్చి చెరువుల్లో నీటిని పరిశీలించి వెళ్లిపోతున్నారు.

అవగాహన కల్పించాం

అన్ని పంచాయతీలలో నీటిని పరీక్షించేందుకు అవసరమైన కిట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఎలా వినియోగించాలో ఇప్పటికే ఆయా గ్రామాల్లోని సిబ్బందికి అవగాహన కల్పించాం. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సైతం ఎప్పటికప్పుడు నీటిని పరిశీలిస్తున్నారు.

- శేఖర్, ఈవోపీఆర్డీ, మండవల్లి